విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని నెంటూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యా యులుగా మారి విద్యా బోధన చేశారు. ఎంఈఓగా లాస్య, ప్రధానోపాధ్యాయులుగా సాత్విక్ వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా సంజన, సాకృతి, విష్ణు ప్రియ, చాందిని అజయ్, అనిల్, ప్రవల్లిక, ఆలేఖ్య అనుభ్ వ్యవరించారు. ఉత్తమంగా విద్యాబోధన చేసిన విద్యార్థులకు ప్రధానో పాధా ్యయులు చంద్రశేఖర్ రెడ్డి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కనకరాజు పాఠశాలలో ఇంటర్నెట్, ప్రింటర్‌ను ప్రారంభించారు. అనం తరం ప్రొజెక్టర్ ఆధారిత బోధన జరుగుతున్న విధానం చూసి ఉపాధ్యాయులను అభినందించారు. ఉపాధ్యాయులు ఉమారాణీ, శైలజ, మాధవి పాల్గొన్నారు.

శ్రీవాణి స్కూల్లో ఘనంగా మ్యాజిక్ డే వేడుకలు

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని భారత్ నగర్‌లోని శ్రీవాణి స్కూల్లో ఘనంగా మ్యాజిక్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ మ్యాజిక్ కళాకారుడు వై. రమేష్ తన మ్యాజిక్ కళల ద్వారా అందర్నీ ఆకట్టుకున్నారు. కేక్ కట్ చేసి తన ఆనం దాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సి.హెచ్ సత్యం మాట్లాడుతూ పి.సి.సర్కార్ జన్మదినోత్సవాన్ని ప్రపంచ మ్యాజిక్ డేగా నిర్వహిస్తారని, మ్యాజిక్ సైన్స్‌పై ఆధారపడిన కళ అని తెలిపారు. అనంతరం కళాకారుడు వై.రమేష్‌ను శాలువా కప్పి, మెమోంటోను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దక్షిణ భారతంలో వికసించనున్న కమలం

నవతెలంగాణ-పటాన్‌చెరు

వచ్చే లోకసభ ఎన్నికల్లో దక్షిణ భారతదేశంలో కమలం వికసించబోతున్నట్టు కేంద్రమంత్రి అశ్విన్ కుమార్ చౌబే ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ విజయసంకల్ప యాత్ర శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా ద్వారా బీహెచ్ఈఎల్ చౌరస్తాలో జిల్లా నాయకులు స్వాగతం పలికారు. అనంతరం పటాన్‌చెరు పట్టణంలో జరిగిన సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. వచ్చే లోక్ సభ ఎన్నికలు కౌరవులు, పాండవుల మధ్య జరిగే యుద్ధమని అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ కులాల మధ్య చిచ్చుపెట్టి దేశాన్ని కాంగ్రెస్ ముక్కలు చేయాలని చూస్తుందని విమర్శించారు. వివిధ కేసుల్లో ఇరుక్కున్న మమత, కేజ్రీవాల్, కవిత త్వరలోనే జైలుకు వెళ్తారని జోష్యం చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు రూ.500కే సిలిండర్ ఇస్తామని హామీలు ఇచ్చారని.. కానీ ప్రభుత్వం ఏర్పడి ఇన్ని నెలలవుతున్నా ఇంకెందుకు ఆ హామీని నెరవేర్చట్లేదు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్రావు, రాష్ట్ర నాయకులు బస్వ లక్ష్మీ నరసయ్య, రాణి రుద్రమ, జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి తో పాటు జిల్లా స్థాయి నాయకులు, పలు మండలాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతన విగ్రహ ప్రతిష్టాపనలో మాజీ ఎమ్మెల్యే పూజలు

నవతెలంగాణ-పాపన్నపేట

మెదక్ ప్రజలందరూ బాగుండాలని విఠలేశ్వర స్వామివారిని వేడుకున్నాని పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పొడిచ్చన్‌పల్లి గ్రామంలోని విఠలేశ్వర నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ కమిటీ వారు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, రైతు సంఘం నాయకులు సోములు, మాజీ సర్పంచులుకుమ్మరి జగన్, లింగారెడ్డి, సుధాకర్, నాయకులు, దుర్గయ్య, ఏడుకొండలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ ఆంథోనీస్‌లో 'స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్'

నవతెలంగాణ-సంగారెడ్డి

పోటీ ప్రపంచంలో పయనమవుతున్న నేటి ఈ సమాజంలో, విద్యార్థులు ప్రతి విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవాలనే సదుద్దేశంతో పట్టణంలోని స్థానిక శాంతి నగర్‌లో గల సెయింట్ ఆంథోనీస్ ప్రీ ప్రైమరీ స్కూల్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్-2 కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత ఈ.సలోమోన్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులైన విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభాపాటవాలను ఉపాధ్యాయులు బోధించే తమ తమ విషయాల వారిగా వెలికితీసే ఒక సహజ ప్రక్రియ ఈ వేదిక అని అన్నారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయుల సహాయ సహకారంతో వివిధ రకాల చాట్స్‌పై తమలో నిగూఢంగా దాగి ఉన్న విషయ విజ్ఞానాన్ని ఎదుటివారికి అర్థమయ్యే విధంగా రాసి, వాటికి సంబంధించిన బొమ్మలు గీసి చక్కగా వ్యక్తం చేశారు. ఇలా చేయడం ద్వారా విద్యార్థుల్లో పోటీ తత్వం పెరిగి, చదువుల్లో చురుకుగా రాణిస్తారన్నారు. ఆక్టివిటి చేసి నిజజీవితంలో వాటిని వాడడం ఎలా అనేది సులభంగా, చక్కగా నేర్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ పాఠశాల ప్రిన్సిపాల్ ఈ.కరుణాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఈ. అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ ఈ.జయబాలరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ విజయ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ప్రభుత్వ పాఠశాలలకు ప్రజల భాగస్వామ్యం అవసరం

నవతెలంగాణ-మర్కుక్

ప్రభుత్వ పాఠశాలలకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంట ప్రధానోపాధ్యాయులు వెంకట రాములు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దామరకుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు మౌలిక సదుపాయాల కల్పనకు పూర్వ విద్యార్థి దాత భీమరి శ్రీకాంత్ రూ.లక్ష చెక్కును పాఠశాల ప్రదానోపా ధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు దాత శ్రీకాంత్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం ఎంతో అభినంద నీయ మన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, నర్సింలు యాదవ్, పరమేశ్వర్, శంకర్ యాదవ్, సంఘం నర్సింలు, రాజు, ఉపాధ్యాయులు రమేష్, కేశవరెడ్డి, సుభాష్, బాల్ రెడ్డి, బ్రహ్మలకయ్య, లక్ష్మీ నారాయణ, రేఖా, తదితరులున్నారు.

పుండరీకం మృతి సాహిత్య రంగానికి తీరని లోటు

నవతెలంగాణ-సిద్దిపేట



పద్య సాహిత్యంలో ఎనలేని కృషి చేసిన సిద్దిపేటకు చెందిన కవి బొద్దుల పుండరీకం మరణించడం సాహిత్య లోకానికి తీరని లోటని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐత చంద్రయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లా డుతూ సిద్దిపేటలో జరిగే అనేక సాహిత్య కార్యక్రమాలలో పాల్గొనడమే కాకుండా, కవి సమ్మే ళనాలలో కవిత గానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచిన పద్య కవి బొద్దుల పుండరీకం చిరస్మరణీయులన్నారు. శేషశైలవాస శతకం, పుండరీక శతకం, గౌరినాథ శతకం, భావ వల్లరి, ముక్తిక మౌక్తికాలు, పరిమళాలు వంటి పలు పుస్తకాలు ప్రచురించారన్నారు. తడకమడ్ల సాహితీ పురస్కారంతో పాటుగా పలు సత్కారాలు పుండరీకం పొందారన్నారు. ఉపాధ్యాయులుగా పని చేసిన ప్రతి పాఠశాలలో తెలుగు భాషా వికాసానికి ఎంతగానో కృషి చేశారన్నారు. కవి మరణం పట్ల జాతీయ సాహిత్య పరిషత్ కవులు ఎన్నవెల్లి రాజమౌళి, ఉండ్రాళ్ళ రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, బి.సుధాకర్, కోణం పర్శరాములు, బస్వరాజ్ కుమార్, మిట్టపల్లి పరశురాములు, సింగీతం నరసింహారావు,తిరుమల క్రాంతి కృష్ణ తదితరులు సంతాపం తెలిపారు.

ఎన్నికలకు.. సన్నద్ధం



పార్లమెంట్ ఎన్నికల సమరానికి రాజకీయ పార్టీలే కాదు అధికార యంత్రాంగం కూడా సిద్ధమవుతోంది. అధికారుల బదిలీల ప్రక్రియ ఇప్పటికే ముగిసింది. ఆయా నియోకజవర్గాల వారిగా ఓటర్ల జాబితాలు సిద్ధమయ్యాయి. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతున్నా అదనపు జాబితాలో చేర్చనున్నారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాల్ని గుర్తించారు. ఈవీఎంల పరిశీలన ప్రక్రియ కూడా చేపట్టనున్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసుకునే పనిలో మూడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలున్నారు.

- ముగిసిన అధికారుల బదిలీలు
- మెదక్ పార్లమెంట్ స్థానానికి ఏడు నియోజకవర్గాల్లో 18.12 లక్షల ఓటర్లు
- త్వరలోనే ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షలు
- 2098 పోలింగ్ స్టేషన్ల గుర్తింపు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోకజవర్గాలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరు, సంగారెడ్డి, మెదక్ జిల్లాలో నర్సాపూర్, మెదక్, సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాలున్నాయి. మూడు జిల్లాల్లోని కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికార యంత్రాంగం రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం సిద్ధం చేస్తున్నారు. ఏడు నియోజకవర్గాల్లోనూ పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సమస్యాత్మక కేంద్రాలు, ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బంది, పోలీస్ బందోబస్తు, ఈవీఎంలు, ఓటర్ల జాబితాల వంటి అంశాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఆ ఎన్నికల్లో విధులు నిర్వ హించిన అధికారులు పూర్తిగా మారిపోయారు. మూడేళ్లకు పైబడిన అధికారులు పూర్తి స్థాయిలో బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు.

18.12 లక్షల ఓటర్లు..



మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రస్తుత ఓటర్ల జాబితా ప్రకారం... 1812853 మంది ఓటర్లున్నారు. నియోజకవర్గాల వారిగా చూస్తే అత్యధికంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో 407419 మంది ఉండగా అత్యల్పంగా దుబ్బాక నియోజకవర్గంలో 199236 మంది ఓటర్లున్నారు. గజ్వేల్ నియోజవర్గంలో 279489 మంది, సంగారెడ్డి నియోజకవర్గంలో 247338 మంది, నర్సాపూర్ నియోజకవర్గంలో 226154 మంది, మెదక్ నియోజకవర్గంలో 216748 మంది, సిద్దిపేట నియోజకర్గంలో 236474 మంది ఓటర్లున్నారు. కొత్త ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు ఇవ్వడంతో కొత్త ఓటర్లు నమోదు అవుతున్నారు. అదే విధంగా పేర్లలో తప్పుల సవరణ, పోలింగ్ స్టేషన్ మార్పు, చనిపోయిన వాళ్ల పేర్ల తొలగింపు ప్రక్రియ కూడా కొనసాగుతుంది.

ముగిసిన అధికారుల బదిలీలు..

మూడు జిల్లాల్లోనూ అధికారులంతా బదిలీ అయ్యారు. సంగారెడ్డి, సిద్దిపేట కలెక్టర్లు మారారు. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలో డీఎస్పీలు, ఎఎస్పీలు, ఎసీపీలు కూడా బదిలీ అయి కొత్త వాళ్లు వచ్చారు. వివిధ శాఖల జిల్లా అధికారులు కూడా అంతర్ జిల్లాల బదిలీలయ్యారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్ఐలు, సీఐలు సైతం బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో అత్యధికులు కొత్త అధికారులే ఉండనున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మూడేళ్లకు పబడి పనిచేస్తున్న అధికారులు, సొంత జిల్లా వాళ్లను బదిలీ చేశారు. ప్రస్తుతం మూడేళ్ల సర్వీస్ పైబడిన వాళ్లతో పాటు గత ప్రభుత్వంతో సన్నిహితంగా ఉన్న పలువురు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల్ని కూడా ప్రభుత్వం బదిలీ చేసింది.

2098 పోలింగ్ స్టేషన్ల గుర్తింపు..

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటి పరిధిలో 2089 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏర్పాటు చేసిన పీఎస్‌లతో పాటు అదనంగా కొన్ని ఏర్పాట్లు చేయనున్నారు. ఆయా పోలింగ్ స్టేషన్ల వారిగా భారీ బందోబస్తు నిర్వహించేందుకు అవసరమైన పోలీస్ బలగాల్ని కూడా సమకూర్చుకునేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా ఎన్నికల విధుల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని కూడా నియమించడంతో పాటు శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు.

ఈవీఎంల పరిశీలన ప్రక్రియ..

ఎన్నికల నిర్వహణలో ఈవీఎంలే కీలకమైనవి. అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంను ఉపయోగించారు. చాలా తక్కువ చోట్ల మాత్రమే ఈవీఎంలు మొరాయించినట్లు గుర్తించారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఈవీఎంల సమస్య తలెత్తకుండా అధికారులు చూస్తున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇప్పటికే పలు చోట్ల ఈవీఎం ఓటింగ్ విధానంపై డెమో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఈవీఎంలను భద్రపరిచ్చన స్ట్రాంగ్ రూముల వద్ద భారీ బందోబస్తు పెట్టారు. మూడు జిల్లాల కలెక్టర్లు కూడా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులతో పలుమార్లు సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకునేలా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

పట్టణాల అభివృద్ధికి ప్రాధాన్యత

- ఎండాకాలంలో తాగునీటి సమస్య రావొద్దు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ
- జహీరాబాద్ డయాలసిస్ సెంటర్‌కు ఐదు యూనిట్లు మంజూరు



నవతెలంగాణ-జహీరాబాద్

పట్టణాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో కృషి చేస్తున్నదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణానికి గతంలో మంజూరైన నిధులతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఇదివరకు టెండర్ల దశలో నిలిచిపోయిన పనులకు సంబంధించి తిరిగి ప్రతిపాదనలు పంపించినట్టు మున్సిపల్ అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వాటికి వెంటనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా కనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జహీరాబాద్ పట్టణా నికి 15.85 ఎంఎల్‌డి నీటి అవసరమండగా మిషన్ భగీరథ నుండి 9 ఎమ్మెల్‌డి నీటిని సరఫరా చేయగా.. త్రీ ఎమ్మెల్‌డి బోర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్టు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే రూ.66 కోట్లతో ఎటికేపల్లి నుంచి మరో 7 ఎమ్మెల్‌డి నీటిని జహీరాబాద్ అవసరాలకు తరలించేందుకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఐడిఎస్ఎంటి కాలనీలో 202 ప్లాట్‌లకు సంబంధించిన సమస్యను తక్షణమే పరిష్కరించాలని.. వాటికి కావాల్సిన సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పట్టణంలో చేపడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించి ఐదేండ్లు అవుతు న్నా.. ఎందుకు పూర్తి కాలేదని ఆర్అండ్‌బి అధికారులపై ఆగ్రహించారు. ఆ బ్రిడ్జి నిర్మాణానికి త్వరలోనే రూ.10 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించి ఏడాదవుతున్నా. నేటికీ దుకాణాలు కేటాయించకపోవడంతో రోడ్లపై కూరగాయలు విక్రయిస్తున్నారని పలువురు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన నాలుగున్నర కోట్లను నాలుగు రోజుల్లో విడుదల చేయిస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో మంత్రి సమక్షంలోనే కలెక్టర్‌కు కాంట్రాక్టర్ దుకాణ సముదాయాల తాళాలను అప్పగించారు. జహీరాబాద్ పట్టణంలో నియోజకవర్గంలో ఇదివరకు పంపిణీ చేసిన డబుల్ బెడ్రూం ఇండ్లల్లో అవకతవకలు జరిగినట్లు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపించి అర్హులకు పంపిణీ చేసేందుకు కృషి చేస్తామన్నారు.

డయాలసిస్ సెంటర్‌కు ఐదు యూనిట్ల మంజూరు..

జహీరాబాద్ పట్టణంలోని డయాలసిస్ కేంద్రంలో కేవలం ఐదు యూనిట్లు మాత్రం ఉండడంతో రోగులు ఎక్కువగా ఉన్నందున డయాలసిస్ యూనిట్లను మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేసిన వెంటనే డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి ఐదు యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కమ్యూనిటీ వైద్యశాలను పర్యటించి విభాగాలు అన్నింటినీ పరిశీలించారు. మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు ఆదేశించారు. ఎం సి హెచ్ భవన పనులను పూర్తిస్థాయిలో త్వరలో పూర్తి చేయాలి ఆదేశించారు. బ్లడ్ బ్యాంకు ను కూడా త్వరలోనే మంజూరు చేస్తామని దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, దీప్చంద్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ మహమ్మద్ సాబీర్, ఏఈ సత్యనారాయణ, డిఎస్పి రామ్మోహన్ రెడ్డి, ఈ పబ్లిక్ హెల్త్ యాదయ్య, కమ్యూనిటీ వైద్యశాల సుప్రీంనగర్ డాక్టర్ శ్రీధర్ వైద్యులు నాగరాజు పాటిల్, హైమావతి, చంద్రశేఖర్, ప్రతిభ పాటిల్, రాజు పాల్గొన్నారు.

రూ.250.00 లక్షలతో పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-ఝరాసంగం

ఝరాసంగంలో ఎన్‌హెచ్ఎం నిధులు రూ.250.00 లక్షలతో నిర్మించ తలపెట్టిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, మాజీ మంత్రి చంద్రశేఖర్, జిల్లా పాలనాధికారి వల్లూరి క్రాంతితో కలిసి శుక్రవారం మంత్రి రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పేద ప్రజల కోసం పనిచేస్తుందని తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్ నియామక పత్రాలను అందుకున్న టీఎస్ఎస్‌పీ అభ్యర్థులకు వెంటనే శిక్షణకు అనుమతించాలని అభ్యర్థులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. అంతేగాకుండా నిమ్జ్ భూ బాధితుల సమస్యను పరిష్కరించాలని ఎల్గోయి, బర్దిపూర్ గ్రామస్తులు మంత్రిని కోరగా.. రైతులు ప్రభుత్వానికి సహకరించాలని అందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి సమస్యను



పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో కంపెనీలు వెలువడితే అనేక ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఆశ్రమంలో శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ పిఠాధిపతి 108 అవధూత గిరి మహారాజ్ తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వినీల నరేష్, ఎంపీపీ దేవదాస్, ఎంపీటీసీ రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హను మంత రావు పాటిల్,జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ శంకర్ పాటిల్, డిఎం అండ్‌హెచ్‌ఓ గాయత్రీ దేవి, ఆర్డీవో రాజు, తహసీల్దార్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుకు వచ్చినప్పుడు ప్రతీక్షణం విలువైనదే

- ఏఐజీ ఆస్పత్రి కన్సల్టెంట్ వైద్యురాలు డాక్టర్ పాశం మేధారెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు

ఎవరైనా వ్యక్తి గుండెపోటుకు గురై కుప్పకూలినప్పుడు ప్రతి క్షణమూ విలువైనదేనని గుండె పునర్జీవనం కోసం తక్షణమే ప్రయత్నించాలంటూ, ఆయా మెళకువలను ఏఐజీ ఆస్పత్రి కన్సల్టెంట్ వైద్యురాలు డాక్టర్ పాశం మేధారెడ్డి చేసి చూపారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ 'బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్), ప్రథమ చికిత్స' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె ప్రధాన వక్తగా, శిక్షకురాలిగా పాల్గొన్నారు.భారత ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ విద్యార్థి విభాగం (ఐపీఏ-ఎస్ఎఫ్), ఏఐజీ ఆస్పత్రి, గీతం ఫార్మసీ విద్యార్థుల సంఘం (జీపీఎస్) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో ఆమె బీఎల్ఎస్, ప్రథమ చికిత్స పద్ధతులపై సమగ్ర ప్రసంగం చేసి, వాటిని ప్రదర్శించి చూపారు. గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ నిర్వహణ పద్ధతి, తక్షణం స్పందించే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీపీఆర్ చేసే విధానం, సమయానుకూల జోక్యం వంటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. గుండెపోటుకు గురైనప్పుడు గోల్డెన్ అవర్ గురించి చెబుతూ, తొలి నిమిషంలో గుండె నొక్కుకుంటూ చికాకుగా కనిపిస్తారని, నాలుగు నిమిషాల లోపు మెదడు దెబ్బతినదని, ఆరు నిమిషాల లోపు ఆ ప్రమాదం తప్పదని, పది నిమిషాల తరువాత తీర్చలేని నష్టం జరుగుతుందని చెప్పారు. గుండెపోటుకు గురైన వ్యక్తి ప్రతిస్పందనను ముందుగా తనిఖీ చేయాలని, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలను అందుబాటులోకి తేవాలని (108కి లేదా ప్రయివేటు



అంబులెన్స్‌కు ఫోన్ చేయడం), శ్వాస-నాడీ స్పందన లేనప్పుడు సీపీఆర్ చేయాలని డాక్టర్ మేధ సూచించారు. సీపీఆర్ పద్ధతులపై ఆచరణాత్మక ప్రదర్శనలను చేసి చూపారు. ఛాతీపై ఉన్న బట్టలను తొలగించి, రెండు చేతులు వంపు లేకుండా నిటారుగా పెట్టి నొక్కాలని, 30 సార్లు నొక్కాక, రెండు మార్లు రోగి నోటిలోకి గాలిని ఊదా లని, అది కొనసాగిస్తూనే ఉండాలని సూచించారు. ఒక్కరు ఎక్కువ సేపు సీపీఆర్ చేయలేరు కాబట్టి, అందుబాటులో ఉన్నవారు రోగి నుంచి ప్రతిస్పందన వచ్చేవరకు ప్రయత్నించాలన్నారు. అలాగే ఈ మధ్య బహిరంగ ప్రదేశాలలో అందుబాటులో ఉంచుతున్న ఎక్స్టెర్నల్ డీఫిబ్రిలేటర్ల వినియోగించే (షాకిచ్చే) విధానాన్ని చూపారు. అధ్యాపకులు, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆమె జవాబులిచ్చారు. స్కూల్ ఆఫ్ ఫార్మసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బప్పాదిత్య ఛటర్జీ అతిథిని స్వాగతించగా, డాక్టర్ గటాడి శ్రీకాంత్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఇందులో ఏఐజీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ మరియం, వికాస్, అశోక్‌తో పాటు పలువురు గీతం అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుంబురీశ్వర ఉత్సవాల్లో హోరాహోరీగా కుస్తీలు

నవతెలంగాణ-టేక్మాల్

మండలంలోని వేల్పుగొండ గ్రామంలో జరుగుతున్న తుంబురీశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ కుస్తీ పోటీలను నిర్వహించారు. కొబ్బరికాయ కుస్తీతో మొదలుకొని 5 తులాల వెండి కడేం కుస్తి వరకూ అంగరంగా వైభవంగా పోటీలు జరిగాయి. ఈ కుస్తీ పోటీలకు మహారాష్ట్ర, కర్ణాటక నాందేడ్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున హాజరయ్యారు. చివరి కుస్తీ కామారెడ్డి జిల్లా అంతాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ పైల్వాన్‌కు కామారెడ్డి జిల్లా పెద్దకొడప్గల్ మండలం బేగంపూర్ కు చెందిన విజయ్ పైల్వాన్‌ల మధ్య హోరాహోరీగా సాగింది. చివరకు అంతాపూర్ కుస్తీ పైల్వాన్ గంగాధర్ గెలుపొందాడు. గెలుపొందిన కుస్తీ పైల్వాన్‌కు గ్రామానికి చెందిన సొంగ రాములు చేతుల మీదుగా 5 తులాల వెండి కడెం బహూకరించారు. అనంతరం తుమ్మరీశ్వర స్వామినీ దర్శించుకుని దీవెనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజి సర్పంచ్ బోయిని నారాయణ, గ్రామ పెద్దలు నిరుడి దాసు , అబ్బనీ సాయిలు, మూడ నర్సింలు, యోగేందర్, ఆకుల రాములు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-సంగారెడ్డి

బీజేపీ హర్యానా ప్రభుత్వ పోలీస్ కాల్పుల్లో 23 ఏళ్ల యువరైతు మృతిని నిరసిస్తూ రైతు సంఘం, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సంగారెడ్డి న్యూ బస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవ్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో రైతుల భూములను, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పుతూ మోడీ తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం 15 నెలల పాటు నిర్విరామ పోరాటం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో దేశ రైతాంగానికి మోడీ ప్రభుత్వం క్షమాపణలు చెబుతూ.. పలు హామీలు ఇచ్చారని.. ఆ హామీలను నేటికీ అమలు చేయట్లేదన్నారు. కాబట్టే రైతాంగం రెండోదఫా పోరాటాలకు దిగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గత పదేండ్ల కాలంలో మోడీ విధానాల ఫలితంగా 1,60,000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేసి ఉంటే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీకి శాంతియుతంగా పాద యాత్ర చేస్తున్న రైతాంగంపైకి హర్యానా బీజేపీ ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి.. అంతర్జాతీయ సమాజం నిషేధించిన పెల్లెట్స్ వంటి ఆయుధాలను, భాష్ప వాయు గోళాలను ప్రయోగించిందన్నారు. దాంతో 200 మంది రైతులు గాయపడి, అనేక మంది చూపు కోల్పోయారని, ముగ్గురు రైతులు ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నారన్నారు. శుభ్ కరణ్ సింగ్ అనే 23 ఏళ్ల యువరైతు ప్రాణాలు వదిలాడని, ఇవి సాధారణ మరణాలు కావని, మోడీ ప్రభుత్వ హత్యలని విమర్శించారు. రైతులపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న క్రూరమైన అణిచివేత దేశ ప్రజలకు తెలియకుండా పంజాబ్, హర్యానా, ఢిల్లీ సరిహద్దుల్లో ఇంటర్నెట్‌ను బంద్ చేశారని, 43 లక్షల కోట్ల విలువచేసే వ్యవసాయ రంగాన్ని అంబానీ, అదాని వంటి కార్పోరేట్ స్నేహితులకు అప్పగించేందుకే మోడీ దొడ్డిదారిన నల్ల చట్టాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దేశ ప్రజలందరూ అన్నం పెట్టే రైతాంగానికి మద్దతుగా నిలిచి మోడీ ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర హెూంమంత్రి రాజీనామా చేయాలన్నారు. పోరాటం సందర్భంగా చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం రూ.10 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నరసింహారెడ్డి, శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు బాబురావు, సువర్ణ, సంగీత, నర్సింలు, లక్ష్మణ్, యాదయ్య, రాజేశ్వర్, సుగుణమ్మ, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సదాశివపేట



సదాశివపేట మండల పరిధిలో గల మాచిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కాగా హెచ్ఎంగా అమీర్, ఎంఈఓగా ఆయన్, డీఈవోగా ఇమ్రాన్, ఉపాధ్యాయులుగా సరిత, నందిని, శృతి, శ్రావణి, అనూష, వైష్ణవి, సంజన, పీఈటిగా సందీప్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లింగం, ఉపాధ్యాయులు చంద్రమౌళి, శివలక్ష్మి, రేణుక, అలివేణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల ఎమ్మెల్యేల దిగ్భ్రాంతి

నవతెలంగాణ-పటాన్‌చెరు, సంగారెడ్డి





సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురిగా.. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఆమె అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి, కంటోన్మెంట్ ప్రజలకు తీరని లోటు అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లోని ఏఆర్‌టీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్, డేటా మేనేజర్, ఫార్మసిస్ట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కువార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టులు పూర్తిగా కాంట్రాక్ట్ ప్రతిపాదన ఉంటాయని, బదిలీలు చేయబడవన్నారు. మెడికల్ ఆఫీసర్ (01)కు అర్హత ప్రమాణాలు ఏ ఆర్‌టి మెడికల్ ఆఫీసర్ ఎంబీబీఎస్ అయి ఉండాలని, అతను/ఆమె కంప్యూటర్ పరిజ్ఞానంతో ఎమ్మెస్ ఆఫీస్ ఇంటర్నెట్ వినియోగం, ఎలక్ట్రానిక్ మెయిల్ అయి ఉండాలన్నారు. అలాగే వయస్సు 65 ఏండ్లు మించకూడ దన్నారు. ఏకీకృత వేతనం రూ.72,000 నెలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. డేటా మేనేజర్ (01) అర్హత ప్రమాణాలు గ్రాడ్యుయేట్ ప్రాధ్యానముగా కంప్యూటర్స్/ గణితం/ గణాంకాలు/బిజినెస్ మేనేజ్మెంట్/ అడ్మినిస్ట్రేషన్ లేదా సంబంధిత సబ్జెక్టులలో, కంప్యూటర్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ వినియోగం, ఎలక్ట్రానిక్ మేనేజ్‌పై నైపుణ్యం కలిగి ఉండాలి. డేటా మేనేజ్మెంట్‌లో శిక్షణ, అనుభవం ఉన్న అభ్యర్థులు, ఆరోగ్య సంబంధిత సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన పని పరిజ్ఞానం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఏకీకృత వేతనం రూ.21,000, ఫార్మసిస్ట్ (01) అర్హత ప్రమాణాలు ఫార్మసిస్ట్ గుర్తింపు పొందిన సమస్త నుండి ఫార్మసీలో డిగ్రీని కలిగి ఉండాలని, డిగ్రీ ఉన్న అభ్యర్థి అందుబాటులో లేకుంటే ఆరోగ్య సంరక్షణ సంస్థలు 3 ఏండ్ల అనుభవం ఉన్న ఫార్మసీలో డిప్లొమా హోల్డర్ ను పరిగణించవచ్చు అన్నారు. అతను/ఆమె రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉండా లని.. అభ్యర్థికి ఎంఎస్ ఆఫీస్ ఇంటర్నెట్, ఎలక్ట్రానిక్ మెయిల్ వినియోగంపై పరిజ్ఞానంతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలన్నారు. ఏకీకృత వేతనం రూ.21,000 ఉంటుందన్నారు. ప్రచురణ తేదీ నుంచి 15రోజులలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో దవ్వూరుకు చెందిన శిరీష ఆత్మహత్య

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



బాసర ట్రిపుల్ ఐటీలో చదువుతున్న సంగారెడ్డి జిల్లా మనూరు మండలం దవ్వూరుకు చెందిన తెనుగు శిరీష గురువారం హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. 'బావ మృతిని తట్టుకోలేకనే తానూ చనిపోతున్నానని.. బావను చంపిన వాళ్లను వదలొద్దంటూ' పలు విషయాలను ప్రస్తావిస్తూ సూసైడ్ నోట్ రాసి అఘాయిత్యానికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. విషయం తెల్సుకున్న శిరీష తల్లిదండ్రులు ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించడం అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది.

రాయికోడ్ నూతన ఏడీఏగా సత్యనారాయణ



నవతెలంగాణ-రాయికోడ్

రాయికోడ్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగా దొంతుల సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన హారిత రాష్ట్ర కార్యాలయానికి బదిలీపై వెళ్లడంతో ఇప్పటివరకు ఇన్చార్జి ఏడీఏగా ఉన్న శివ కుమార్ పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరిం చారు. మండల కేంద్రంలోని రాయికోడ్‌లో ఉన్న వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ..వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీల గురించి ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఏవో అవినాష్ వర్మ సిబ్బంది ఉన్నారు.



12 దాటినా పత్తాలేని వ్యవసాయ అధికారులు

కార్యాలయం ఎదుట యువకుల నిరసన

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలు దాటినా ఒక్క అధికారి కూడా హాజరుకాలేదని.. ఇలాగైతే పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే రైతుల పరిస్థితి ఎలా అని ప్రశ్నిస్తూ కార్యాలయం ఎదుట యువకులు శుక్రవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. మిట్ట మధ్యాహ్నం అయినా వ్యవసాయ శాఖ కార్యాలయం అధికారులు అక్కడికి రాకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడినుండి వెనుదిగారు. ఈ నిరసనలో యువ నేతలు పుట్టి సురేష్, తొల్లగూడెం రాము, మోచ రాజు, రాళ్లకత్వ యాదగిరి, బండి ప్రదీప్ గౌడ్, పుట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



నాపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదు

నవతెలంగాణ-హత్నూర

భూమిని కబ్జా చేశానంటూ తనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. 12 ఏండ్ల క్రితం కొనుగోలు చేసిన భూమిని.. ఇప్పుడు కబ్జా చేశానంటూ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అమ్మిన వారిని, గ్రామ పెద్దలను మీడియా ముఖంగా తీసుకువచ్చినట్టు చెప్పారు. గత రెండ్రోజులుగా కావాలని తనను, కాంగ్రెస్ పార్టీని కావాల్సుకుని బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ తంగేడిపల్లి భాస్కర్ గౌడ్, ఓ పత్రికా రిపోర్టర్ వనరిగారి వీరేశం, తలారి భాస్కర్, బాన్సువాడ శ్రీకాంత్ గౌడ్, తంగడపల్లి ప్రభు గౌడ్, గడ్డం రామరాజు, మరియు బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ పై, తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేసి.. అలాగే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగరాజు అక్కమాని వారి కుమార్తె శారదాబాయి, పిప్పడి పల్లి మొగులయ్య, మిద్దె చితయ్య, తలారి లింగయ్యపి.రాజు, ఎం నాగరాజు టి ప్రసాద్ శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన రైతుబంధు

- గతేడాది జనవరి 21కే ముగిసిన నగదు బదిలీ
- ప్రస్తుతం ఫిబ్రవరి ముగిస్తున్న పూర్తికాని చెల్లింపులు
- నేటికీ మూడు ఎకరాలకు మించని సాయం
- పెట్టుబడి సాయం కోసం మిగతా రైతుల ఎదురుచూపులు
- యాసంగి ముగుస్తున్న జమకాని దుస్థితి

నవతెలంగాణ-ఝరాసంగం



అసెంబ్లీ ఎన్నికలకు ముందే రైతుబంధు సాయం రావాల్సి ఉండగా, ఎన్నికల కమిషన్ జోక్యంతో నగదు బదిలీ ప్రక్రియ ఆలస్యం జరిగింది. అప్పుడు మొదలైన ఆలస్యం నేటికీ కొనసాగుతూనే ఉన్నది. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఖజానా ఖాళీగా ఉందని ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే రైతుబంధు నగదు బదిలీలో ప్రభుత్వం జాప్యం చేసింది. దాంతో ప్రతిపక్షాలు, రైతుల నుంచి ఒత్తిడి రావడంతో ప్రభుత్వం 2023 డిసెంబరు 11వ తేదీ నుంచి రైతుబంధు సాయాన్ని అందజేస్తున్నట్టు ప్రకటించింది. కాగా, అప్పటి నుంచి రైతుబంధు నగదు జమ నత్తనడకన సాగుతోంది. ఇప్పుడింత.. అప్పుడింత అన్నట్టుగా కొన్ని దఫాల్లో మూడు ఎకరాలలోపు డబ్బులను జమచేసింది. ఇప్పటి వరకు మూడెకరాల రైతులకు కూడా పూర్తిమొత్తంలో సాయం అందలేదు. దీంతో యాసంగి సీజన్ ప్రారంభంలో చేతిలో పెట్టుబడి డబ్బు లేక రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇటీవలే ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పూర్తిస్థాయిలో రైతుబంధు ఇస్తామని ప్రకటించగా, యసంగి సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నగదు ఖాతాలో జమ కాకపోవడంతో రైతులు వాపోతున్నారు.

ఇంత జాప్యం ఎప్పుడు జరగలే...

యాసంగిలో రైతు బంధు చెల్లించటానికి ఇంత జాప్యం ఎప్పుడూ జరగలేదు. 2018-19 యాసంగి సీజన్ వచ్చే సరికి తెలంగాణ శాసనసభ ముందస్తు ఎన్నికలు వచ్చాయి. దాంతో నవంబరులోనే రైతుబంధు నగదు బదిలీ చేశారు. 2019-20లో డిసెంబరు, జనవరి నెలల్లో చెల్లింపులు చేశారు. 2021లో ఓ నియోజకవర్గ ఉప ఎన్నిక వచ్చింది. అప్పుడు కూడా నవంబరులోనే రైతుబంధు పూర్తిచేశారు. గత ఏడాది జనవరి 21 నాటికే రైతుబంధు నిధుల జమ పూర్తికాగా.. ఈసారి ఫిబ్రవరి దాటినా కొలిక్కిరావడం లేదు. ఝరాసంగం మండలంలో 16281 మంది రైతులకు గాను రూ.14.46 కోట్లు కావాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు 13460 మంది రైతులకు వారి ఖాతాలో 9.08 కోట్లు మాత్రమే జమ చేసినట్టు సంబంధిత అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. దాంతో మిగిలిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే ఇందుకు సంబంధించి రాష్ట్ర ఖజానాలో డబ్బులు లేకపోవటం, ఆర్థిక శాఖ నుంచి ట్రెజరీకి నిధులు సమకూరకపోవటంతో పథకం ముందుకు సాగటంలేదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

రైతులకు తప్పని తిప్పలు..

యాసంగి సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నది. మరోపక్క పంట రుణమాఫీ సక్రమంగా కాకపోవడంతో బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వడానికి ఆసక్తి చూపించడం లేదు. దాంతో రైతుబంధు రాక, పంట రుణాలు అందక ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే రైతుబంధు నగదు బదిలీ ప్రక్రియను వేగవంతం చేయాలని మండల రైతులు కోరుతున్నారు.



వేసవిలో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలి

నవతెలంగాణ-జహీరాబాద్

రాబోయే వేసవిలో జహీరాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలుగకుండా అధికారులు, సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ డిఈ లక్ష్మీనారాయణ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని పివిఆర్ గార్డెన్లో శుక్రవారం నిర్వహించిన డివిజన్ స్థాయి ఉద్యోగుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. రాబోయే వేసవికాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉండాన్నారు. సరఫరాలో అంతరాయం ఏర్పడితే.. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. లోటపాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మండల అధికారి ఏఈల పై ఉందన్నారు. ప్రజల నుంచి విద్యుత్ సమస్యపై ఏవైనా ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించాలని, విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ మధుసూదన్, రజనీకాంత్, ఆయా మండలాల ఏఈలు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



సొంతడబ్బులతో గల్లీలో మొరం పోయించిన మాజీ వార్డు సభ్యురాలు

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో ఆరో వార్డులో రాకపోకల సౌకర్యానికి గాను కటిక గణేష్ ఇంటి ముందు నుంచి గల్లీ వరకు శుక్రవారం జిన్నారం గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు నవ్య మహేందర్ గౌడ్ సొంత డబ్బులతో మొరం పోయించారు. మొరం పోయించడంతో గల్లీలో తిరిగే పాదాచారులకు, ద్విచక్ర వాహన దారులకు సౌకర్యంగా ఉందంటూ గల్లీ వాసులు కాంగ్రెస్ పార్టీ నేత, జిన్నారం గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు నవ్య మహేందర్ గౌడ్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి వేడుకలు

నవతెలంగాణ-సంగారెడ్డి





సమాజమార్పుకు, కుల నిర్మూలన కోసం కృషిచేసిన గొప్ప మహనీయుడు, స్వచ్ఛభారత్ పితామహుడు, సంత్ గాడ్గే బాబా జయంతి వేడుకలను రజక సంఘాల సమితి ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జాతీయ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమేష్ గౌడ్, రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్, బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ పులిమామిడి రాజు, రజక సంఘాల సమితి జిల్లా అధ్యక్షులు నామాల నాగేష్, యువజన సంఘాల సమితి అధ్యక్షులు డా. కున వేణుగోపాల కృష్ణ, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర, మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో పుట్టిన సంత్ గాడ్గే బాబా భిక్షాటన చేసి అనేక పాఠశాలలను, ఆశ్రమాలను ఏర్పాటు చేశారన్నారు. అంటరానితనం నిర్మూలన కోసం కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన జయంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా జరపాలని, సంగారెడ్డిలో ఆయన విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘాల సమితి జిల్లా అడ్వైజర్ పట్నూరి నర్సింలు, సంగారెడ్డి మండల అధ్యక్షులు అందిపురం రాజు, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మామిళ్ళ నాగభూషణం, వైస్ ప్రెసిడెంట్ వీరన్న, రజక సంఘం యువత నాయకులు సాయి, దేవా, అనిల్, రాములు, నర్సింలు, గోపాల్, మహిళలు అనంతమ్మ, కిష్టమ్మ మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : గాడ్గే బాబా జీవిత చరిత్ర సమాజానికి ఆదర్శమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు నగేష్ షెట్కర్ అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో సంత్ గాడ్గే బాబా 148వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్ శెట్కార్ హాజరై మాట్లాడుతూ.... సంత్ గాడ్గే బాబా కులం లేని సమాజాన్ని నిర్మించడానికి కృషి చేశాడన్నారు. భజన కీర్తన ద్వారా మద్యాన్ని దూరం చేయాలని, జీవ హింస చేయకూడదని, విద్య బలోపేతానికి అహర్నిశలు పాటుపడ్డారన్నారు. మఠాలను పాఠశాలలుగా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్సేన, దేవరాజ్, ఆర్తి, తుకారం, సంత్ చౌక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ బ్యాంకు ఉద్యోగుల ఒక్కరోజు సమ్మె





నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నిరసిస్తూ సంగారెడ్డిలోని ఏపీజీవీబీ రీజనల్ కార్యాలయం వద్ద ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒక్క రోజు సమ్మెను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఆర్‌బీఈఏ సెంట్రల్ కమిటీ మెంబర్ ప్రకాశం మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామీణ బ్యాంకులను కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకుగా ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అలవెన్సులను సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం వెంటనే ఇవ్వాలన్నారు. గ్రామీణ బ్యాంకుల్లో పని చేస్తున్న డైలీ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ సెంట్రల్, ట్రెజరర్ శామ్యూల్, జాన్సన్, ఏపీజీవీబీ ఆఫీస్ అసిస్టెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అశ్విన్, రీజనల్ సెక్రటరీ రామకృష్ణ, ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ సెక్రటరీ రవికుమార్, రైటర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజనల్‌సెక్రటరీ పద్మభూషణ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

జిన్నారం : మండల కేంద్రమైన జిన్నారంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శ్రేణులు మేనేజర్ రాజు నాయక్ ఆధ్వర్యంలో సంగారెడ్డి ధర్నాకు తరలి వెళ్లాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఏకతాటిపై తీసుకురావడం, రిక్రూట్మెంట్ చేపట్టడం లాంటి ప్రధానమైన డిమాండ్లతో జాతీయస్థాయిలో 43 జాతీయ రీజనల్ రూరల్ బ్యాంక్స్ శుక్రవారం సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. అలాగే మార్చి 27, 28 తేదీల్లో సమ్మెకు దిగనున్నట్లు ఆయన చెప్పారు. బ్యాంకు శ్రేణులకు సంబంధించి పెన్షన్ గ్రాట్యుటీ ఇతరత్రా డిమాండ్లతో జాతీయ స్థాయిలో 43 రీజినల్ రూరల్ బ్యాంక్స్ సమ్మెకు దిగినట్లు చెప్పారు. కాగా బ్యాంకు శ్రేణులు సమ్మెకు దిగడంతో జిన్నారంలో బ్యాంకు సేవలు నిలిచిపోయాయి.

ట్రాక్టర్లు, ట్రాలీల దొంగల అరెస్టు.. రిమాండ్

- రూ.8.10 లక్షల విలువ సొత్తు
- జోగిపేట సీఐ అనిల్ కుమార్

నవతెలంగాణ-జోగిపేట



చెడు మార్గాలను ఎంచుకొని ట్రాక్టర్లు, వాటి ట్రాలీలను ఎత్తుకెళ్తున్న దొంగలను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్టు జోగిపేట సీఐ అనిల్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక కార్యాలయంలో విలేకరులకు శుక్రవారం వివరించారు. పుల్కల్ మండలంలోని శివంపేట గ్రామానికి చెందిన ఆలకుంట నరేష్ నత్తి రాజీవ్, లేగల రవి కుమార్, వడ్డే శీను, వడ్డే కుమార్, బండారి రవిలు ఒక బృందంగా ఏర్పడి పుల్కల్ మండల పరిధిలోని ఆయా గ్రామాల శివారులో ఉన్న ట్రాక్టర్, ట్రాలీలను అపహరిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం పుల్కల్ మండలానికి చెందిన ట్రాక్టర్‌ను ఇంజిన్‌తో లాక్కుపోయి ఒక దగ్గర భద్రపరిచారు. సంగారెడ్డి ప్రాంతంలో ఒక ట్రాలీని దొంగలించారు. అంతేకాకుండా రెండు ట్రాక్టర్ ఇంజన్లు, నాలుగు ట్రాక్టర్ ట్రాలీలను దొంగలించారు. వాటిని విక్రయించడానికి పొరుగు రాష్ట్రానికి చెందిన వ్యక్తితో బేరం కుదుర్చుకొని అమ్మే ప్రయత్నం చేస్తుండడంతో పుల్కల్ మండలం ముదిమాణిక్యం చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని పుల్కల్ ఎస్సై శ్రీకాంత్ అరెస్టు చేసి విచారించారు. దాంతో వారు చేసిన దొంగతనాలను ఒప్పుకున్నారు. వాటి విలువ సుమారుగా రూ.8.10 లక్షలు ఉంటుందన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్టు చెప్పారు. ఈ విలేకర్ల సమావేశంలో పుల్కల్ ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

నల్తూర్‌లో ఘనంగా మల్లన్న జాతర





నవతెలంగాణ -జిన్నారం

మండల పరిధిలోని నల్తూర్‌లో భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి, నల్తూరు మాజీ సర్పంచ్ జనార్ధన్, భీమ్రావు, పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్, జిన్నారం ఎంపీపీ దమ్మగౌని రవీందర్ గౌడ్, బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి, భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మాదారం కలాలి రాజు గౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ గౌడ్, యువ నేత నరేష్, స్థానిక గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్‌ను గెలిపిద్దాం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

అద్దంకి దయాకర్ గెలుపు కోసం కృషి చేయాలని ఉమ్మడి జిల్లా దళిత సంఘాల నాయకులు టి.దేవరాజ్ అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నుంచి అద్దంకి దయాకర్ ఎక్కడి నుంచి పోటీ చేసినా ఆయన గెలుపు కోసం కృషి చేస్తావన్నారు. అంబేద్కర్ సంఘాల నాయకులతో చర్చించామని.. ఆయన గెలుపు కోసం దళిత నాయకులంతా కలసికట్టుగా కృషి చేయాలన్నారు. ఆయనకు టీపీసీసీ అధ్యక్షులుగా బాధ్యతలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సామెల్, పండరి, తుకారాం, భీమ్ సేన, నారాయణ, ఆర్తి మాల, తదితరులు పాల్గొన్నారు.



పోస్ట్ ఆఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని ఖమ్మంపల్లి, పోల్కంపల్లీ, చిన్నచెల్మెడ, గ్రామ ప్రజలు, ఖమ్మంపల్లి గ్రామంలో ఉన్న పోస్ట్ ఆఫీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ కిషన్ సూచించారు. పోస్ట్ ఆఫీసులో రకా రకాల స్కీములు ఉన్నాయన్నారు. ప్రమాద భీమా, జీవిత బీమా, (తకువ ప్రీమియం - ఎక్కువ బోనస్) రూ.500తో సేవింగ్ ఖాతాను, మినిమం రూ.100తో ఆర్ డి.(రిక రింగ్ డిపాజిట్) ప్రతి ఇంట్లో ఇద్దరు ఆడపిల్లల కు (10 సంవత్సరాల లోపు)250 రూపా యలతో సుకన్య సమృద్ధి అకౌంట్ ప్రారంభించవచ్చని వివరించారు. ఇంకా ఫిక్స్‌డ్ డిపాజిట్, పీపీఎఫ్, తదితర పోస్ట్ ఆఫీసుకు చెందిన లాభ దాయకమైన పొదుపు పతకాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ వన్ కోసం శిక్షణ

- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విజయ లక్ష్మి

నవతెలంగాణ-మెదక్

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ వన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి శుక్రవారం పేర్కొన్నారు. ఒక్కో స్టడీ సర్కిల్ నందు 100 మందికి రెసిడెన్షియల్ కోచింగ్ ఇవ్వబడుతుందని, ఇందులో ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 15 శాతం సీట్లు ఉంటాయన్నారు. మొత్తంగా 33 శాతం సీట్లు మహిళలకు, 5 శాతం సీట్లు వికలాంగులకు రిజర్వ్ చేయబడ్డాయన్నారు. భోజనం, వసతి, ఉత్తమ ఫ్యాకల్టీతో శిక్షణ, స్టడీ మెటీరియల్స్, డిజిటల్ క్లాసులు, రెఫరెన్సుకై వందల పుస్తకాలు, నిరంతర మూల్యాంకనకై వారాంతపు పరీక్షలు మొదలగునవి కలిగిన ఈ శిక్షణ ఐదు నెలలపాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ స్టడీ సర్కిల్ లో ప్రవేశానికి ఎంపిక పోటీ పరీక్ష ద్వారా నిర్వహించబడుతుందన్నారు. ఇందుకోసం ఫిబ్రవరి 23 నుంచి స్టడీ సర్కిల్ వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరి తేదీ మార్చి 6 అని, పరీక్ష హాల్ టికెట్లు మార్చి 7 నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 18 నుంచి శిక్షణ ప్రారంభమై ఆగస్టు 17న ముగుస్తుందని తెలిపారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ- నిజాంపేట



నిజాంపేట గ్రామ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో శుక్రవారం ముదిరాజ్ కులస్తుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులను శాలువా కప్పి సన్మానించారు. గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా పంజా బాబు, ఉపాధ్యక్షులు మాసుల నాగరాజు, కోశాధికారి రెడ్డి రాకేష్, ప్రధాన కార్యదర్శిగా పున్న వెంకటస్వామి , కార్యదర్శి పున్న బాబు, కార్యవర్గ సభ్యులుగా పంజా గణేష్, పంజా నవీన్, రెడ్డి వెంకట్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పంజా బాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు కులస్తులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యవర్గ సభ్యులందరితో కలిసి సంఘం అభివృద్ధికి పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు గెరిగంటి నర్సింలు, గేరిగంటి బాబు, పంజా మహేందర్, పంజ సత్తయ్య, కంది యాదగిరి, దేవుని రాజు,తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్

జిల్లాలో పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో పరీక్షలు నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు వచ్చే నెల (మార్చి) 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 09:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సంవత్సరం జనరల్ సైన్స్ పేపర్‌ను రెండు రోజులు పేపర్ 1, పేపర్ 2 గా నిర్వహిస్తారని తెలిపారు. మార్చి 26న జనరల్ సైన్స్ పేపర్ 1 (ఫిజికల్ సైన్స్), 28న పేపర్ 2 (బయలాజికల్ సైన్స్) ఉంటుందని, ఈ పరీక్షలు ఉదయం 9:30 నుండి 11 గంటల వరకు మాత్రమే ఉంటాయని తెలిపారు. ఈ మార్పును విద్యార్థులు గుర్తించాలన్నారు. ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

68 పరీక్ష కేంద్రాలు

జిల్లాలో మొత్తం 10,300 మంది విద్యార్థులకుగాను 68 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సప్లమెంటరీ విద్యార్థులు 89 మందికి మెదక్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సెంటర్ ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాలను శుభ్రం చేయించాలని, తాగునీటి వసతి కల్పించాలని వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడిపించాలని, పరీక్ష వేళల్లో, రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ సామాగ్రి ఏ ఒక్క అధికారికి అనుమతి లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు పాలనాధికారి రమేష్, జిల్లా విద్యాశాఖ



అధికారి ప్రొఫెసర్ రాధా కిషన్, డిఎస్ఓ రాజిరెడ్డి, ఏఎంవో సుదర్శన మూర్తి, అడిషనల్ ఎస్పీ మహేందర్, ఆర్టీసీ డిఎం సుధా, మెడికల్ ఆఫీసర్ నవీన్, ఎలక్ట్రిసిటీ ఏఈ మోహన్ బాబు, తపాలాధికారి దౌలత్ బాషా, డిటివో సాయిలు, ఆర్పిఏ రిచర్డ్, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కళ్యాణం

- హాజరైన మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి

నవతెలంగాణ-కౌడిపల్లి



మండల పరిధిలోని రాజీపేట గ్రామంలో శుక్రవారం శ్రీ రామ చంద్ర స్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్వామి వారి కళ్యాణం గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని ఎదుర్కోలు నిర్వహించి గ్రామ మాజీ సర్పంచ్ కాశమ్మ లింగం గౌడ్ పద్మ దంపతులు, జక్కపల్లి యాదయ్య మానెమ్మ దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించి స్వామివారి కల్యాణాన్ని గ్రామ పురోహితులు బాపూరావు శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు హాజరైన భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి కళ్యాణ అనంతరం అక్షితలు వేశారు. కళ్యాణం అనంతరం స్వామి అమ్మవార్ల లడ్డూలను వేలం నిర్వహించగా నవ పేటకు చెందిన నరేందర్ చారి 45 వేల ఒక వంద రూపాయలకు , గ్రామానికి చెందిన డప్పు పోచయ్య రెండవ లడ్డు రూ.37,100కు వేలంలో దక్కించుకున్నారు. ఆలయ ప్రాంగణం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి హాజరై కళ్యాణంలో పాల్గొన్నారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు మదన్ రెడ్డికి గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా మదన్ రెడ్డి మాట్లాడుతూ స్వామివారి కృపా కటాక్షంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్నారు .సాయంత్రం గ్రామ పురవీధుల గుండా స్వామివారి పల్లకి ఊరేగింపు ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మాధవి శివ, హనుమాన్ సేవా కమిటీ సభ్యులు గణేష్ గౌడ్, గంగరాం గౌడ్, మల్లేష్, కృష్ణ ,యాదవ్ గౌడ్ ,మోహన్ గౌడ్ ,అశోక్ గౌడ్ సత్యనారాయణ, శేఖర్ భూషణ్ ,మాణ గౌడ్,వెంకట్ గౌడ్, లక్ష్మీనరసయ్య,రాజు, వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

నార్లాపూర్‌లో పశు వైద్య శిబిరం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశు గణాభివృద్ధి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా ఆధ్వర్యంలో పశు వైద్య పశుసంవర్ధక శాఖ వారి సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏ.డి రాంజీ మాట్లాడుతూ పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ సంతానోత్పత్తి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. గొర్రెలకు మందులను పంపిణీ చేశామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్లాపూర్ ఉపసర్పంచ్ సంజీవ్, నిజాంపేట వెటర్నరీ డాక్టర్ సుధాకర్, అసిస్టెంట్ రాజు, సూపర్వైజర్ శ్రీనివాస్, ఆఫీస్ సబార్డినేట్ అలీ, గోపాల మిత్రులు స్వామి, సంతోష్ రెడ్డి, బాబు, శ్రీను, శ్రీకాంత్, కిషన్ బాబు, తదితరులు పాల్గొన్నారు

కొత్త వారితో జాగ్రత్తగా ఉండాలి

- పాపన్నపేట ఎస్సై

నవతెలంగాణ -పాపన్నపేట



అపరిచిత వ్యక్తులను ఎట్టి పరిస్థితులలో నమ్మొద్దని పాపన్నపేట ఎస్సై నరేష్ సూచించారు. మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం సఖి కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు పరిచయమైతే వారిని అన్ని తెలిసే వరకు నమ్మొద్దని ఆయన సూచించారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో సోషల్ మీడియా ద్వారా పరిచయమైన నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమై కిడ్నాప్లకు పాల్పడుతున్న సంఘటనలు చాలానే ఉన్నాయన్నారు. అంతేకాకుండా సఖి కేంద్రం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. కుటుంబ తగాదాలు పోలీస్టేషన్కు వస్తే, తాము సఖి కేంద్రానికి కౌన్సిలింగ్ కోసం పంపడం జరుగుతుందని దీంతో సులువుగా బాధితులకు న్యాయం జరుగుతుందని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా ఎవరైనా ఆపత్కాలంలో ఉంటే 100తో పాటు ఇతర అత్యవసర నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని నరేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం మహేశ్వర్‌తో పాటు సఖి కేంద్రం నిర్వాహకులు లక్ష్మీ స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మి నరసింహ స్వామి జాతర ఉత్సవాలు

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ సమీపంలోని గుట్టపై ఉన్న శ్రీ గండ భేరుండా లక్ష్మి నరసింహ స్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు శుక్రవారం గుట్టపైకి దేవుడిని తీసుకువెళ్లడం, రెండవ రోజు శనివారం స్వామి వారి కళ్యాణం, మూడవరోజు ఆదివారం సత్యనారాయణ వ్రతం, గుండ్లమ్మ వద్ద అగ్నిగుండాల వంటి కార్యక్రమాలు ఉంటాయని ఎంపీటీసీ శ్రీనివాస్ గుప్తా తెలిపారు. ఈ జాతర ఉత్సవాలకు గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

యాసంగిలోనైనా తూముల మరమ్మతులు చేపట్టరా

- ఆయకట్టు దారులకు అందుబాటులో ఉండని ఇరిగేషన్ అధికారులు

నవతెలంగాణ -వెల్దుర్తి



యాసంగిలోనైనా తూముల మరమ్మతులు చేపట్టలేక నీళ్లు వృధాగా పోతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని సిపిఎం మండల కార్యదర్శి గౌరీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌లు ఆరోపించారు. చెరువు కుంటల తూముల మరమ్మతులు ఇరిగేషన్ అధికారులు వెంటనే చేపట్టి వృధాగా పోతున్న నీటిని అరికట్టాలని ఐబి భవన్‌లో అటెండర్ పోచయ్యకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు యాసంగి సీజన్లో రైతులకు అందుబాటులో ఉండాల్సిన ఇరిగేషన్ అధికారులు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తూముల గేట్లు సామర్థ్యానికి మించి నీళ్లను వదలడం. అవి కాస్త వృధాగా పోవడం జరుగుతుందన్నారు. కొన్ని చెరువులలో తూముల నుంచి నీళ్లు లీకేజై వృధాగా పోతున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలాగే నీళ్లు వృధాగా పోతే మార్చి ఏప్రిల్ నెలలో ఎండలు మెండుగా ఉండి పంట పొలాలకు నీరందక ఎండిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. అందుకు ఇరిగేషన్ అధికారులు సమన్వయం పాటించి నీటిని ఒడిసిపట్టి పంట పొలాలకు పారే విధంగా చూసుకోవాలని హెచ్చరించారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి పంట పొలాలకు తగు మోతాదులో నీటిని విడుదల చేసే పనిలో నిమగ్నమై ఉండాలన్నారు. లేనియెడల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకునే విధంగా ధర్నా చేపడతామని హెచ్చరించారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఉపాధ్యాయుడు సస్పెండ్

జిల్లా విద్యాధికారి రాధా కిషన్

నవతెలంగాణ-వెల్దుర్తి: విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఉపాధ్యాయుడు వెంకటరామిరెడ్డిని సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయుడు సమయపాలన పాటించకపోవడంతో గ్రామస్తులు తిరగబడి ఇదేమిటని పలుమార్లు ప్రశ్నించి నిలదీసి పై అధికారులకు ఫిర్యాదు చేసినా విధి నిర్వహణలో మార్పు కనపడడం లేదు. మండల పరిధిలో నెల్లూరు గ్రామ పంచాయతీ ఆవరణలో మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వెంకటరామిరెడ్డి ఈ నెల 16న పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థులు ఆరు బయట ఆడుతూ పాడుతూ ఒకరికొకరు పోట్లాడుతూ అటు వెళ్లే గ్రామస్తుల కంట పడింది. ఇది గమనించిన గ్రామస్తులు పిల్లల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని 10.30 గంటలు అవుతున్నా ఉపాధ్యాయుడు పాఠశాలకు రాకపోవడంతో మండల విద్యాధికారి యాదగిరికి సమాచారం అందించారు వెంటనే పాఠశాలకు చేరుకున్న ఎంఈఓ యాదగిరి 11 గంటలు అవుతున్నా ఉపాధ్యాయుడు పాఠశాలకు రాకపోవడంతో వెంటనే మెమో జారీ చేశారు. అనంతరం జిల్లా విద్యాధికారి రాధా కిషన్ సమాచారం చేరవేశారు. వారం రోజుల అనంతరం శుక్రవారం వెంకటరామిరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈఓ యాదగిరి తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని వారన్నారు

ఘనంగా సంత్ సేవా గాడ్గే జయంతి

- హాజరైన మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్



నవతెలంగాణ-మెదక్ టౌన్: మెదక్ పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో సంత్ సేవ గాడ్గే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత్ సేవా గాడ్గే నిత్యం ప్రజల్లో ఉంటూ తన సేవలందించేవారన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం ఉద్యోగ సంఘ అధ్యక్షులు నర్సింలు, మెదక్ పట్టణ అధ్యక్షులు చౌదరి మల్లేశం, మెదక్ జిల్లా యూత్ ప్రెసిడెంట్ మల్లారెడ్డిపేట విజయ్, పట్టణ రజక సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ సంత్ గాడ్గే బాబా జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం బాధాకరం

- మాల మహానాడు అధ్యక్షులు

నవతెలంగాణ- నిజాంపేట

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని మండల మాల మహానాడు అధ్యక్షుడు బండారి చంద్రయ్య అన్నారు. లాస్య నందిత తండ్రి సాయన్న మరణించి సంవత్సరమవుతున్న తరుణంలో కూతురు మృతి చెందడం దురదృష్టకరమన్నారు. యువ ఎమ్మెల్యే లాస్య నందిత ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గానికి సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేసిన సాయన్న కుమార్తెగా ఆయన మరణాంతరం ఎమ్మెల్యేగా ఎన్నికైన స్వల్ప కాలానికి లాస్య నందిత ఇలా రోడ్డు ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమని వాపోయారు. కార్పోరేటర్‌గా ఎన్నికై క్షేత్రస్థాయిలో పనిచేయడం ద్వారా ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారని ఆమె సేవలను కంటోన్మెంట్ ప్రజలు మర్చిపోరన్నారు. లాస్య నందిత ఆత్మకు శాంతి కలగాలని, ఆమె కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులకు నిజాంపేట మండల మాల మహానాడు తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు.



జాతీయ సదస్సులు జ్ఞాన సమూపార్జనకు సోపానాలు

- ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి

నవతెలంగాణ-మెదక్ టౌన్

జాతీయ సదస్సులు జ్ఞాన సమూపార్జనకు సోపానాలని ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలు ఐక్య రాజ్య సమితి చేసిన సూచనలకు అనుగుణంగా ఉన్నాయా అని విశ్లేషణ చేసే రెండు రోజుల జాతీయ సదస్సు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైంది. ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కే పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ పర్యావరణం అనేది ఎవరి ఆస్తి కాదు. ఇది ఉమ్మడి ఆస్తి అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపైన ఉన్నదన్నారు. పర్యావరణం పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే ప్రకృతి సృష్టించే విధ్వంసానికి బలి కావాల్సి ఉంటుందని తెలిపారు. నేడు మనం సృష్టించే విధ్వంసం వలన భూతాపం, ఎడారి కరణ పెరిగి, అడవుల క్షీణత పెరిగి, కాలువలు, నదులలో పారిశ్రామిక వ్యర్థాలను వదలడం వలన భూతాపం పెరిగి వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. ఈ మార్పుల వలన అతివృష్టి లేదా అనావృష్టి సంభవిస్తున్నాయన్నారు. ఈ సదస్సులో అతిథిగా హాజరైన సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో బాధ్యతాయుతంగా ఉంటూ



జ్ఞానాన్వేషణకై కృషి చేయాలన్నారు. ఇలాంటి సెమినార్లు, వర్క్‌షాప్‌లు, సదస్సులు విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతో విలువైన సమాచారాన్ని అందిస్తాయని తెలిపారు. సదస్సులో విలువైన పత్ర సమర్పణలు ఉన్నాయని విద్యార్థులు శ్రద్ధతో పాల్గొనాలని రాజనీతి శాస్త్ర శాఖధిపతి సమీరా నజ్మీన్ సూచించారు. ఈ సదస్సు సమన్వయకర్త డాక్టర్ రాజాగౌడు మాట్లాడుతూ ఈ సదస్సులలో సుమారు 200 పత్రసమర్పణలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్. వైస్ ప్రిన్సిపల్ సింహారెడ్డి, ప్రవీణ్ కుమార్, మహేంద్రుల గణపతి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ తిరుమలరెడ్డి, డాక్టర్ దినకర్, వెం కటేశ్వర్లు, డాక్టర్ వామనమూర్తి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శరత్ రెడ్డి, శ్రీమతి అన్నపూర్ణ, సుధారాణి, హరిత నిదర్శిని విద్యార్థులు, వివిధ కళాశాల నుండి పత్ర సమర్పణ చేయడానికి విచ్చేసిన పరిశోధకులు పాల్గొన్నారు.

గొర్రెలను పంపిణీ చేస్తే బాగుండేది

- గొర్ల పైసలు వాపస్ ఇవ్వడం సంతోషకరం
- బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల చాలా నష్టపోయాం



వజ్జ రాజు, నిజాంపేట

నవతెలంగాణ-నిజాంపేట

గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము గొల్ల కురుమల కోసం గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషమైన విషయమే ఆ పథకాన్ని అందరికీ వర్తించేలా కొనసాగిస్తే బాగుండేదని మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని గ్రామాల గొల్ల కురుమలు వాపోతున్నారు. మండలంలోని గొల్ల కురుమలు గొర్ల పంపిణీ కోసం ఒక్కొక్కరు 43,750 చొప్పున జిల్లా కలెక్టర్ పేరు మీద మండలంలో మొత్తం 198 డీడీలు తీయడం జరిగింది. వారి దగ్గర డబ్బులు లేకున్నా మహిళల మెడలో ఉన్న నగలను కుదువబెట్టి డీడీలు కట్టామని, దాదాపు సంవత్సరం దాటినా కూడా గొర్ల పంపిణీ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీలకు తీసుకొచ్చి డీడీలు కట్టామని మరి కొంతమంది ఆవేదన వ్యక్తం చేశారు. డీడీలు కట్టిన పైసలు వస్తాయో? రావో? అని ఆందోళన చెందామని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గొర్ల పంపిణీ కార్యక్రమం చేపడితే బాగుండేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వలన గొల్ల కురుమలు చాలా నష్టపోయారని మిత్తిలు మీద పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ డబ్బులు తమకు తిరిగి ఇవ్వడం చాలా సంతోషకరమైన విషయమని గొల్ల కురుమలు తెలిపారు.

మా డబ్బులు మాకు రావడం చాలా సంతోషం.

గత ప్రభుత్వం గొల్ల కురుమలను మోసం చేసింది. గొర్రెలు పంపిణీ చేస్తామని డీడీలు కట్టించుకుని ఇవ్వకపోవడం దగా చేయడమే."ముందొచ్చినోనికి ముంతంబలి", "ఎనుకొచ్చినోనికి తెడ్డు అంబలి" అనే విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించింది. డీడీలు కట్టిన డబ్బులు వస్తాయో రావో అని దిగులుతో ఉండేవారమని ప్రస్తుత ప్రభుత్వం తమ మొర ఆలకించి తమ డబ్బులు తమకు ఇవ్వడం చాలా సంతోషకరమైన విషయం.

సీఎంఆర్ పూర్తి చేయకపోతే చర్యలు తప్పవు

- ఫిబ్రవరి 29 చివరి గడువు లోపు పూర్తి చేయాలి
- రైస్ మిల్లర్లకు తేల్చి చెప్పిన కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్



ఫిబ్రవరి 29 గడువు వరకు సీఎంఆర్ పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఫిబ్రవరి 29 వరకు అవకాశం ఇచ్చిందని, అప్పటి వరకు బియ్యం పెట్టని మిల్లుల యజమానులపై ఆర్ఆర్ యాక్ట్ క్రింద స్థిర చర ఆస్తులు జప్తు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. నెలలు గడుస్తున్నా మిల్లర్ల అలసత్వాన్ని తీవ్రంగా పరిగణిస్తామన్నారు. రైతుల నుంచి ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసి సమకూర్చిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరుపుతూ ఈ నెలాఖరులోగా నిర్దేశిత కోటాకు అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలను భారత ఆహార సంస్థకు చేరవేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావు కల్పిస్తూ, నిబంధనలను ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు వెనుకాడబోమని కరాఖండీగా తేల్చిచెప్పారు. సీఎంఆర్ కేటాయింపుల్లో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున, ఇకపై మిల్లర్ల అలసత్వాన్ని తాము ఎంత మాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లాలోని రైస్ మిల్లులలో సీఎంఆర్ కేటాయింపుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే ధాన్యాన్ని కొనుగోలు చేసి అయినా నిర్ణీత గడువులోపు లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని మిల్లర్లకు చెప్పారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని రైస్ మిల్లులలో తప్పనిసరిగా పూర్తి స్థాయి సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ రైస్ మిల్లింగ్ జరుపుతూ, ఈ నెలాఖరు లోపు ఎఫ్సీఐ కి నిల్వలు చేరవేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, డిసిఎస్ఓ బ్రహ్మారావు, రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు కాంగ్రెస్ నాయకుల సన్మానం



నవతెలంగాణ-నార్సింగి: ఇటీవల నార్సింగి మండల ఎంపిడిఓ ఆనంద మేరీ బదిలీ అయ్యారు. నూతన ఎంపిడిఓగా చిన్నా రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతన ఎంపిడిఓను సాదరంగా కలిసి, స్వాగతించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ చిన్నా రెడ్డి మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటానని, మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఫలాలు అందరికీ అందేలా చేస్తానని, దానికి స్థానిక నాయకుల, ప్రజల సహాయ సహకారాలు కావాలని కోరారు. తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. మెదక్ జిల్లా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, మెదక్ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కేశవులు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వినోద్, ఎంఎస్ఎస్ఓ అధ్యక్షుడు రుక్మద్దీన్, గౌడ సంఘం అధ్యక్షుడు కృష్ణా గౌడ్, నరసింహులు పాల్గొన్నారు.

కష్టకాలంలోనూ పార్టీ కోసం పనిచేసిన సుదర్శన్ గౌడ్

- సుదర్శన్ గౌడ్‌కే పలువురి మద్దతు

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శివంపేట మండలానికి చెందిన ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న కొడకంచి సుదర్శన్ గౌడ్‌ను కాంగ్రెస్ అధిష్టానం నియమించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొడకంచి సుదర్శన్ గౌడ్ విద్యాభ్యాసం నుంచి కాంగ్రెస్ పార్టీ కి కరుడుగట్టిన కార్యకర్తగా పనిచేస్తూ వస్తున్నాడు. 2009లో ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులుగా, 2017లో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా, 2020లో కాంగ్రెస్ పార్టీ శివంపేట మండల అధ్యక్షులుగా పదవులు చేపడుతూ వస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే సునీత రెడ్డి అప్పట్లో కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరిన సమయంలో శివంపేట మండలంలోని ముఖ్య నాయకులు ,ప్రజా ప్రతినిధులు సునీత రెడ్డి వెంట భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా శివంపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ మొత్తం ఖాళీ అయిందని అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే సుదర్శన్ గౌడ్ శివంపేట మండలంలో కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ముఖ్య నాయకులు ఎవరూ లేకపోయినా మండలంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది అన్నట్లుగా పార్టీని ముందుకు తీసుకువచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో శివంపేట మండలం నుంచి బీఆర్ఎస్ పార్టీకి గట్టి పోటీ ఇచ్చే విధంగా సుదర్శన్ గౌడ్ ఎన్నికల్లో పనిచేశాడు. ప్రస్తుతం నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న ఆవుల రాజిరెడ్డికి సుదర్శన్ గౌడ్ ప్రధాన అనుచరుడని పేరుంది. నర్సాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బిసి జనరల్ కు కేటాయించడం జరిగిందని వార్తలు వినిపిస్తున్నాయి. నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సువాసిని రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డిల సహకారంతో కాంగ్రెస్ అధిష్టానం సుదర్శన్ గౌడ్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించనున్నట్లు సమాచారం.

నర్సరీలను సందర్శించిన ఎంపీడీవో రాజిరెడ్డి



నవతెలంగాణ- నిజాంపేట

మండల పరిధిలోని నార్లపూర్, వెంకటాపూర్ (కె)గ్రామాలలోని నర్సరీలను శుక్రవారం స్థానిక ఎంపీడీవో రాజిరెడ్డి, సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం నేపథ్యంలో చెట్లు, మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని. చెట్లకు నీడను అందించేలా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయాలని వన సేవకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, ఆయాగ్రామాల కార్యదర్శులు ప్రశాంత్ గౌడ్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

దేవక్కపల్లి భక్తజన సంద్రం

- వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని దేవక్కపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర శుక్రవారం భక్తజన సంద్రమైంది. మండలంలోని అయా గ్రామాల భక్తులు వనదేవతలకు మొక్కులు చెల్లించడానికి భారీగా తరలివచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున జాతరకు తరలిరావడంతో భద్రతను ఎస్ఐ క్రిష్టారెడ్డి పర్యవేక్షించారు.

పీఏసీఎస్ చైర్మన్ ఘన స్వాగతం

వడ్లూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ కమిటీ సభ్యులు పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్ రావుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.

యువ ఎమ్మెల్యే మృతి బీఆర్ఎస్‌కు తీరనిలోటు



నవతెలంగాణ-మర్కుక్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మర్కుక్ ఎంపీపీ తాండ పాండుగౌడ్, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం వారు మర్కుక్ విలేకర్లతో మాట్లాడుతూ కంటోన్మెంట్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అక్రమ ఇసుక స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి

- ఇసుక నిల్వలపై చర్యలకు పోలీసులకు అదేశాలు



నవతెలంగాణ-బెజ్జంకి

విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్రమ ఇసుక నిల్వల స్థావరాలపై శుక్రవారం దాడి చేశారు. మండల పరిధిలోని గాగీల్లపూర్, బెజ్జంకి క్రాసింగ్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక నిల్వలను గుర్తించారు. ఇసుక నిల్వలపై చట్టపరమైన చర్యలకు స్థానిక పోలీసులకు అదేశాలు జారీ చేశారు. అక్రమ ఇసుక, రేషన్ బియ్యం తరలింపు, మత్తు పదార్థాలను కలిగి ఉన్నా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ అధికారులు హెచ్చరించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే 8712667446, 8712667447 నంబర్లకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-మిరుదొడ్డి

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మిడిదొడ్డి ఎస్ఐ పరశురాములు అన్నారు. అక్బర్ పేట బొంపల్లి మండల పరిధిలోని రుద్రారం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలియపరచ వద్దన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టంగా చదివి ఉన్నత స్థాయిని అధిరోహించాలన్నారు. చదువుకుంటేనే జీవితంలో ఏదైనా సాధించవచ్చన్నారు. సిపి ఆదేశానుసారంగా గుడ్ టచ్ బాడ్‌టచ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఎవరైనా వేధించినా, రోడ్లపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా వెంటనే సమాచారాన్ని అందించాలన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, సిద్దిపేట షీ టీం బృందం కిషన్, ఏఎస్ఐ మధు, మహిళా కానిస్టేబుల్ మమత, వీణకుమారి, కానిస్టేబుళ్ల ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు



నవతెలంగాణ-నంగునూరు

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు కె.వి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్, మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇంచార్జి కల్వకుంట్ల వంశీధర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అంక్షాపూర్ గ్రామంలో కె.వి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఆలాగే సిద్దిపేట నియోజకవర్గంలో కె.వి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాల నుంచి ఇక్కడి క్రీడాకారుల కోసం ఎన్నో కార్యక్రమలు చేపట్టామన్నారు. దాని కృషి ఫలితంగానే క్రీడారంగాలో సిద్దిపేట నియోజకవర్గం రాష్ట్రంలో చాలా ముందడుగు వేసిందని గుర్తు చేశారు. టోర్నమెంట్ నిర్వహిస్తున్న నిర్వాహకులకు, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపి మొదటి మ్యాచ్‌ని టాస్ వేసి ప్రారంభించారు.

మార్కండేయ దేవాలయంలో 61వ వార్షికోత్సవం



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో 61వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి పరమేశ్వరుల కళ్యాణాన్ని పూజారులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కెవిఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మహారాష్ట్ర స్టేట్ ఇంచార్జ్ కల్వకుంట్ల వంశీధర్ రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ దేవాలయ అధ్యక్షులు కామిని రాజేష్, చేర్యాల మల్లికార్జున్, ఇప్పకాల శ్రీహరి, గుండు రవితేజ, రాపల్లి శ్రీనివాస్, బూర మధుసూదన్, మచ్చ పురుషోత్తం, గణేష్, పెద్ది రాజు, రాజ్ కోటి, సిరిగాది బాల్రాజ్, మదూరి వెంకటేష్, గోనె బాల నారాయణ, కొంక రాజేశం, లగిశెట్టి యాదగిరి, గోనె జగదీష్ బాబు, కెవిఆర్ ఫౌండేషన్ సభ్యులు రాజ్ కుమార్, సురేందర్, కర్ణాకర్, వెంకట్, సంతోష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన తాజా మాజీ సర్పంచ్



నవతెలంగాణ-మర్కుక్

గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పాములపర్తి తాజా మాజీ సర్పంచ్ పాములపర్తి తిర్మల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో పాములపర్తి గ్రామంలో ఈజీఎస్ నిధుల ద్వారా రూ.20 లక్షల నిధులను సిసి రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఉపసర్పంచ్ పద్మ నర్సింలు మర్కుక్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు తండా కనకయ్య గౌడ్, గ్రామ అధ్యక్షుడు క్రాంతి కుమార్, గ్రామ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డి.బాలకృష్ణ, వార్డు సభ్యులు నాగరాజు, మంగి కిషన్, చేకలి మల్లేష్, చంద్రం గౌడ్, సుధాకర్, మహేష్, రాజయ్య, నర్సింలు, మల్లయ్య, గ్రామ ప్రజలు తదితరులున్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

- సామాజిక కార్యకర్త కిరణ్



నవతెలంగాణ-మిరుదొడ్డి

నేటి బాలలే రేపటి బావి భారత పౌరులుగా ఎదగాలని దళిత సామాజిక కార్యకర్త పెద్ద లింగన్నగారి కిరణ్ అన్నారు. శుక్రవారం మిర్దొడి మండలం లింగుపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరానికి ఎదగాలన్నారు. విద్యార్థులకు మంచి విద్యను అభ్యసించడానికి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన కొరకు ప్రత్యేకంగా శ్రద్ధచూపి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల తరపున అతనికి ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని కోరారు.

ప్రమాదకర స్థితిలో సిబ్బంది విధులు..!

- అమలుకు నోచుకొని జిల్లా పశువైద్యాధికారుల అదేశాలు
- బేగంపేట గ్రామంలో అధ్వాన్నస్థితిలో పశువైద్యాశాల భవనం

నవతెలంగాణ-బెజ్జంకి

గత పంచాయతీ పాలకవర్గం సభ్యులు, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్ల మూగజీవాలకు వైద్య సేవలందించే పశువైద్యాశాల భవనం పూర్తిస్థాయిలో ప్రమాదకర స్థాయికి చేరింది. గత ప్రజాప్రతినిధులు విస్మరించడంతోనే ఇంతటి దౌర్భాగ్య దుస్థితి నెలకొని పశువైద్యశాల తన ఉనికి కోల్పోయే స్థితికి చేరిందని అయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. పశువైద్యశాలకు ఉన్న చుట్టుపక్కల సుమారు 9 కి.మీ పరిధిలో వడ్లూర్, బేగంపేట, గూడెం, లక్ష్మీపూర్, తలారివానిపల్లి గ్రామాల్లోని ఆరు రకాల మూగజీవాలకు వైద్య సిబ్బంది సేవలందించే వారు. గ్రామంలోని మురుగు నీరు పశువైద్యశాల భవన ఆవరణలోకి చేరి నిల్వ ఉండడంతో భవనం పునాదుల్లోకి నీరు చేరి గోడలు శిథిలావస్థలోకి చేరాయి. చేరుతున్న మురుగు నీరు నిల్వ ఉండడడతో దుర్గంధం వెదజల్లుతోంది. భవనంలోకి మురుగు నీరు చేరకుండా అరికట్టాలని పలుమార్లు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు వైద్య సిబ్బంది విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో పశువైద్యశాల భవనం నేడు తన అస్తిత్వం కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవ చూపి నూతన పశువైద్యశాల భవన నిర్మాణానికి కృషి చేయాలని పాడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకరమని తెల్చేసిన అధికారులు

జిల్లా పశువైద్య జేడీ జగత్ కుమార్ రెడ్డి ఫిబ్రవరి 8, 2023న బేగంపేట గ్రామంలోని పశువైద్యశాల భవనాన్ని క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. పశువైద్యశాల భవనం అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉందని వెంటనే భవనాన్ని తొలగించాలని నివేదిక అందించారు. పశువైద్యశాల భవనం పూర్తిగా ప్రమాదంగా ఉందని అధికారులు తెల్చేసిన భవనాన్ని తొలగించడంలో ఏడాదిగా కాలయాపన చేస్తున్నారు. ప్రమాదకరమని తెల్చిన భవనంలోనే నేటికి సిబ్బంది పశువులకు వైద్య సేవలు యథాతథంగా అందించడం విడ్డూరం. పశువులకు వైద్య సేవలు అందించడానికి భవనం అనుకూలమైన పరిస్థితుల్లేవని వెంటనే తొలగించాలనే అధికారుల ఆదేశాలు అమలుకు నోచుకోకపోవడం గమనార్హం.

నూతన భవన నిర్మాణం చేపట్టాలి

మూగజీవాలకు అందించే వైద్య చికిత్సపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దుర్వాసనతో పశువైద్యశాల భవనంలోకి వెళ్లేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. శిథిలావస్థలోకి చేరిన బేగంపేట గ్రామంలోని పశువైద్యశాల భవనాన్ని తొలగించి నూతన భవన



నిర్మాణం చేపట్టాలని అయా గ్రామాల పాడి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భవన నిర్మాణాలకు ప్రణాళికలు పంపించాం

శ్రీకాంత్ రెడ్డి, పశువైద్యాధికారి బెజ్జంకి


బేగంపేట గ్రామంలోని పశువైద్యాశాల భవనాన్ని జిల్లా అధికారులు పరిశీలించి ప్రమాదకర స్థాయిలో ఉందని తెల్చారు. బేగంపేటతో పాటు బెజ్జంకి మండల కేంద్రంలో నూతన పశువైద్యశాల భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపించాం.

ప్రాణ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికపై వివాదం

- ఈఓ,అర్చకుడి తీరుపై ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల అగ్రహం
- ఆలయ ఈఓ,అర్చకుడు అవకతవకలకు అజ్యమిస్తున్నారని ఆరోపణలు
- విధుల్లో నిర్లక్ష్యం వవహిస్తున్న ఈఓ, అర్చకుడిని తొలగించాలని డిమాండ్

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ మూర్తుల ప్రాణప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రికపై వివాదం రాజుకుంది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమేయం లేకుండా ఆలయ ఈఓ విశ్వనాథ శర్మ, ప్రధాన అర్చకుడు మధుసూదన చారి భక్త బృందం పేరుతోఈ నెల 27 నుంచి 29 వరకు లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ మూర్తుల ప్రాణప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం తలపెట్టడాన్ని శుక్రవారం ఆలయ ఆవరణ వద్ద కమిటి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ ఈఓ, ప్రధాన అర్చకుడు విధుల్లో వ్యవహరిస్తున్న వ్యవహారంపై ఆలయ అభివృద్ధి చైర్మన్ బండారి రాములు, సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తీవ్ర ఆరోపణలు చేశారు. చైర్మన్ బండారి రాములు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులను విస్మరించి ఆలయ ఈఓ, ప్రధాన అర్చకుడు కలిసి ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులకు సమాచారం లేకుండా దాతల



సహకారంతో లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ మూర్తుల ప్రాణప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం నిర్వహించ తలపెట్టడం పలు అవకతవకలకు తావివ్వడమేనని అనుమానం వ్యక్తం చేశారు. దేవదాయ శాఖ నిబంధనలను దిక్కరించి ఆలయ ప్రధాన అర్చకుడు మధుసూదన చారి ఆలయ భక్తులకు అర్చక సేవలకు ఏగనామం పెట్టి ప్రైవేటుగా విధులు నిర్వహిస్తున్నారని ఈ తతంగమంత ఈఓ చూసీచూడనట్టు వ్యవహరించడం దేవాదాయశాఖ నిబంధనలను ఉల్లగించడమేనన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమేయం లేకుండా దాతల సహకారంతో నిర్వహించ తలపెట్టిన ప్రాణప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి, ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న ఆలయ ఈఓ, ప్రధాన



అర్చకుడిని విధుల నుంచి తొలగించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఆలయ ఈఓ, ప్రధాన అర్చకుడు వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా పరిపాలనాధికారికి, దేవాదాయ శాఖాధికారికి పిర్యాదు చేయనున్నామని సభ్యులు తెలిపారు.

వివాదాలకు తావులేకుండా వ్యవహరిస్తే అభివృద్ధి

విశ్వనాథ శర్మ, ఆలయ ఈఓ, బెజ్జంకి

భక్తబృందం వారు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ మూర్తుల ప్రాణప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం నిర్వహించ తలపెట్టారు. మంచి ఆరాధ్యయోగమైన కార్యక్రమమని అదేశాలు ఇచ్చాం. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి కార్యక్రమం నిర్వహించాలని భక్తబృందం సభ్యులకు సూచించాను. వివాదాలకు తావులేకుండా అందరూ సామరస్యపూర్వకంగా వ్యవహరిస్తే అభివృద్ధి బాగుంటుంది. ఆలయంలో ప్రధాన అర్చకుడు విధులు నిర్వహించడం లేదని కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. అర్చకుడిపై ఆలయ కమిటీ సభ్యులు తీర్మానం చేసి ఇస్తే ఖచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం

- సీనియర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 1969-70 సంవత్సరంలో అప్పటి గ్రామ సర్పంచ్ జగదేవపూర్ గాంధీ స్వర్గీయ ఆదరాసుపల్లి నరసింహరామయ్య పంతులు కృషితో స్థాపించబడి నేటికి 54 వసంతాలు పూర్తిచేసుకున్న శుభతరుణంలో కళాశాల వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జగదేవపూర్, మర్కుక్, తుర్కపల్లి మండలాల్లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. జగదేవపూర్ మండల విద్యాధికారి ఉదయ భాస్కర్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల జగదేవపూర్ తరపున వివిధ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గత సంవత్సరం వార్షిక పరీక్షలో 948/1000 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిన కుమారి ఎస్ కే .హసీన (బైపిసి)కి నరసింహరామయ్య స్మారక పురస్కారం, 4 వేల నగదు బహుమతి, ఏఎస్ఆర్ పీపుల్స్ ట్రస్ట్ జగదేవపూర్ వారు అందించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ భానోతు రాజన్న



మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, మంచి నడవడికలతో మెలగాలని రాబోయే వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. గత సంవత్సరం పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలను కొనియాడారు. విద్యార్థులు ఆటపాటలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చాందీ కుమారి, పి. శ్రీనివాస్, వాడకట్టు శ్రీనివాస్ , పివిఎన్ ఆచార్యా, శ్రీధర్, శేఖర్, మోహన్ దాస్, శ్రీనివాసరావు, స్వామి, సతీష్, లక్ష్మారెడ్డి, దాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు నమ్మవద్దు

- నంగునూరులో కనువిప్పు కార్యక్రమం



నవతెలంగాణ-నంగునూరు

మూఢనమ్మకాలు, బాణమతి, చేతబడిలాంటి మంత్రాలు తంత్రాలు నమ్మవద్దని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. పోలీసు కళాబృందం ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు అనే కార్యక్రమం గురువారం రాత్రి రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నంగునూరు మండల కేంద్రంలో నిర్వహించారు. రాజగోపాల్ పేట ఎస్సై భాస్కర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ ఈ టెక్నాలజీ ప్రపంచంలో బాణామతి వాళ్ళ చేశారు.. వీళ్ళు చేశారు.. అంటే నమ్మవద్దన్నారు. ఏదైనా అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రిలో చూపించుకోవాలన్నారు. మెజీషియన్ నరేష్ మూఢనమ్మకాలు, చేతబడులు, బాణామతి అంశాలపై అవగాహన కల్పించారు. పోలీస్ కళా బృందం, తెలంగాణ సాంస్కృతిక సారథి సిద్దిపేట రూరల్ టీమ్ కళాకారులతో కనువిప్పు అనే కార్యక్రమం ద్వారా మూఢనమ్మకాలపై వివరించారు. మద్యం తాగడం వల్ల కలిగే నష్టాలు, కుటుంబ కలహాలు, పేకాట ఆడుట, వృద్ధులైన తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని డ్రైవింగ్ లైసెన్స్ , షీ టీమ్స్ జరుగుతున్న సైబర్ నేరాల గురించి పాటలు, సిడిల ద్వారా కళాబృందం సభ్యులు బాలు, రాజు, రవీందర్, తిరుమల, జిల్లా సాంస్కృతిక సారథి బృందం సభ్యులు భాస్కర్, యాదగిరి, నర్సింలు, మోతే బాబు, శేఖర్ లు పాటల, నాటకం రూపంలో ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో మహతి విద్యా నికేతన్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ -గజ్వేల్: కరాటేలో రాణించాలని మహతి విద్యానికేతన్ కరస్పాండెంట్ గోపీనాథ్ శర్మ అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ మహతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొని పథకాలు సాధించిన వారికి మహతి హై స్కూల్ పాఠశాల కరస్పాండెంట్ గోపీనాథ్ శర్మ అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రుద్రమదేవి మెగా కప్ ఫోర్త్ నేషనల్ ఓపెన్ కరాటే కుంగ్‌ఫ్యూ ఛాంపియన్‌షిప్ 18న యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారని ఆయన తెలిపారు. పోటీలకు మహతి విద్యానికేతన్ హై స్కూల్ నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఏడుగురు విద్యార్థులు బంగారు పతకం, 9 మంది విద్యార్థులు వెండి పథకాలు, మిగతా విద్యార్థులు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ సాధించారు. వీరిని మహతి విద్యానికేతన్ స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో సత్కరించామన్నారు. అలాగే కరాటే కృష్ణ విద్యార్థికి విద్యార్థులకి కరాటేలో మంచి శిక్షణ ఇస్తున్నారని కొనియాడారు. ఆత్మ రక్షణ కోసం కరాటే ఉపయోగపడుతుందని ప్రతి ఒక్క విద్యార్థినీ విద్యార్థులు కరాటేలో ప్రావీణ్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షబానా ముంతాజ్, సహ ప్రధానోపాధ్యాయుడు శశిధర్ శర్మ, కరాటే కోచ్ కృష్ణ , పిఈటీలు శ్రీ కుమార్, విజయ్ కుమార్, తిరుపతి, భార్గవి పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కవ్వంపల్లి ఎన్నికవ్వడంతో మొక్కుల చెల్లింపులు



నవతెలంగాణ-బెజ్జంకి

మానకొండూర్ నియోజవర్గ ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ ఎన్నికవ్వడంతో అయన అభిమానులు సమ్మక్క సారలమ్మకు మొక్కులు చెల్లించారు. శుక్రవారం మండల పరిధిలోని వడ్లూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవంలో స్థానికులు రాసూరి మల్లికార్జున్, కాసాని నర్సయ్య, పులి రమేశ్, కుక్కల రాములు, గాండ్ల తిరుపతి, గాండ్ల అంజన్న, శరత్, అనిల్ తదితరులు ఎత్తు బంగారం మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదు



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని గౌరారం (ములుగు సబ్ డివిజన్)లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఈఆర్ భాను ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి, గృహ అవసరాలకు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రణాళికబద్దంగా విద్యుత్ అందజేస్తామన్నారు. రాష్ట్రా అవసరాలకు సరిపడే విద్యుత్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రానున్న యాసంగిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ అందుతుందని భరోసాను కల్పించారు. ప్రస్తుతం ప్రణాళికాబద్ధంగా ఎలాంటి అంతరాయలు లేకుండా విద్యుత్ సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏడీఈ జీ. శ్రీనివాస్, ఏఈలు సంతోష్ కుమార్, శ్రీనివాస్, సుధీర్, సబ్ డివిజాన్ ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక



నవతెలంగాణ-సిద్దిపేట

స్థానిక స్టేడియం గ్రౌండ్‌లో సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అథ్లెటిక్స్ అండర్ 14 , 16, 18, 20, ఓపెన్ కేటగిరీలో బాల బాలికలకు వేరువేరుగా సిద్దిపేట జిల్లా అథ్లెటిక్ సంఘం అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్ జెండా ఊపి ఎంపికలు ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25న హైదరాబాదులోని కొల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కొత్తగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించిన జితేశ్‌ను సంఘ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకట స్వామి గౌడ్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, గ్యాదరి కుమార్, క్రికెట్ కోచ్ విజయ్, సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు కృష్ణ కుమార్, నిషంక్ గౌడ్, లీలానంద, సాయి కిరణ్ , క్రీడాకారులు, క్రీడాకారునిలు పాల్గొన్నారు

ఆధార్ యాప్ బ్యాంకింగ్ అనుసంధానాన్ని ఎత్తివేయాలి

డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుబాసి సంజీవ్

నవతెలంగాణ-నిజాంపేట్



కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలైన హక్కుదారులకు వ్యతిరేకంగా రోజురోజుకు కొత్త కొత్త జీవో లను తీసుకువస్తూ హక్కులను హరించివేస్తుందని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుబాసి సంజీవ్ ఆరోపించారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని గత పది సంవత్సరాలుగా కేంద్ర సర్కారు అడుగడుగున ఉల్లంఘిస్తూ, కూలీలను ఉపాధి హామీ పనికి దూరం చేస్తుందదన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ఆధార్ బెసెడ్ యాప్, బ్యాంక్ లింకెజిలతో కూలీలైన హక్కుదారులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నంద గోకులం గ్రామంలోని చేరువు పూడికతీత పనులను చేస్తున్న కూలీలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూలీల హక్కులను కాపాడేందుకు తోడ్పాటునందించాలన్నారు. పనులవద్ద కనీస సౌకర్యాలైన నీరు,నీడ,ప్రథమ చికిత్స బాక్సులు, పనిముట్లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు గ్రామ ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా మను చౌదరి

నవతెలంగాణ-సిద్ధిపేట కలెక్టరేట్



సిద్ధిపేట జిల్లా కలెక్టర్‌గా మిక్కిలినేని మనుచౌదరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను నీటిపారుదల శాఖ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మిక్కిలినేని మనుచౌదరి పదోన్నతిపై సిద్ధిపేట జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం దెందులూరు గ్రామానికి చెందిన మిక్కిలినేని మనుచౌదరి 2017 ఐఏఎస్ బ్యాచ్ అధికారి.

సమ్మక్క సారలమ్మలకు మొక్కుల చెల్లింపు

నవతెలంగాణ -నంగునూరు



సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా నంగునూరు మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు మొక్కులను చెల్లించుకున్నారు. మేడారం జాతరకు వెళ్ళలేని భక్తులు ఇక్కడే నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకున్నారు. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కోళ్లను, మేకలను బలిచ్చి అక్కడే కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. విందు అనంతరం భక్తులు రాత్రి సమయం వరకు ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యారు. నేడు సమ్మక్క సారలమ్మలు వన ప్రవేశం చేయడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాల్లో శుక్రవారం మొక్కుల సమర్పణలో భాగంగా మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎద్ల సోమిరెడ్డి, బద్దిపడగ కృష్ణారెడ్డి, సంగు పురేందర్, కోల రమేష్ గౌడ్, తిప్పని నాగేందర్,బెదురు తిరుపతి, వెంకటేశం తదితరులు అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

వంటేరుకు కొండంత అండగా కేసీఆర్

మెదక్ పార్లమెంటు స్థానంపై మరింత భరోసా

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గంలో నిత్యం ప్రజల నాలుకల్లో నానుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డికి మాజీ సీఎం కేసీఆర్ కొండంత అండగా నిలుస్తున్నారు. 2018లో బీఆర్ఎస్‌లో చేరిన వంటేరు ప్రతాప్ రెడ్డికి ఎఫ్‌డీసీ చైర్మన్ పదవి ఇచ్చి నియోజకవర్గంలో కాకుండా రాష్ట్రంలో అగ్రస్థానం లో ఉంచారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో ప్రతాప్ రెడ్డికి పూర్తిస్థాయి బాధ్యతలు ఇచ్చి ప్రతి గ్రామాన్ని పర్యటించి కేసీఆర్ విజయానికి శాయశక్తులా కృషి చేశారు. కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీష్ రావు, కేటీఆర్ సైతం వంటేరుకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ స్థానాన్ని ప్రతాప్ రెడ్డికి కేటాయించి గెలిపించే బాధ్యత మాజీ మంత్రి హరీష్ రావు అప్పగించే అవకాశం ఉంది. గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలకు నాయకులకు అందుబాటులో ఉండి వారి శుభకార్యాలకు ఆపద సంపదలకు అందుబాటులో ఉంటున్నారు. మెదక్ పార్లమెంట్ స్థానాన్ని ఇతరులు ఆశిస్తున్నప్పటికీ పార్టీ కోసం కష్టపడ్డ వంటేరుకు ఇవ్వాలని కెసిఆర్ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా పార్టీ నాయకులకు సమాచారం ఇచ్చారు. మిగతా నియోజకవర్గాల్లో ఉన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు మున్సిపల్ చైర్మన్‌లను పార్టీ నాయకులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపారు. మెదక్ పార్లమెంటు స్థానంలో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉండగా ఆరు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండడం ఈ స్థానం పార్టీ ఖాతాలో పడే అవకాశం ఉందని క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి నాయకత్వం గట్టిగా నమ్ముతుంది. గజ్వేల్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ అంశాలను ఎప్పటికప్పుడు మాజీ మంత్రి హరీష్ రావుతో చర్చిస్తున్నారు. పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం కావడమే కాకుండా కార్యకర్తలకు నాయకులకు కొండంత అండగా ఉండాలని ఒంటేరు ప్రతాప్ రెడ్డి భావిస్తున్నారు.

సిద్దిపేటలో ప్రభుత్వ విశ్వవిద్యాలయం నెలకొల్పాలి

నవ తెలంగాణ-సిద్దిపేట



తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్.యు) అధ్వర్యంలో సిద్దిపేట డిగ్రీ, పీజీ కాలేజీ ఆడిటోరియంలో రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, టిపిటీఫ్, డిటీఫ్ సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, సత్తయ్యలు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ యునివర్సిటీని నెలకొల్పాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలనీ, పెండింగ్ హాస్టల్ మెస్ ఛార్జీలు విడుదల చేయాలని కోరారు. ప్రజా సంఘం నాయకుడు జాన్ వెస్లీ, ఏ.ఐ.పి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షుడు కుమార్, న్యాయవాది బైరి ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేసి, విద్య రంగానికి తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దిపేట అగ్రికల్చర్ కాలేజీని వేరే ప్రాంతానికి తరలించే ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు ఇంజనీరింగ్ వింగ్ కన్వీనర్ వెంకట్, న్యాయవాదులు విజయ్ కుమార్, శివ, గర్ల్స్ కన్వీనర్ రేణుక ,అక్షిత తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలకు చేరుతారు

భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

భారత శాస్త్రవేత్త సర్ సివి రామన్ విగ్రహావిష్కరణ

సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

నవ తెలంగాణ- రాయపోల్



ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదువుతేనే ఉన్నత శిఖరాలకు చేరుతారని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ అన్నారు. భారతీయ శాస్త్రవేత్త సి.వి.రామన్ జన్మదినాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వం ఫిబ్రవరి 28వ తేదీన జాతీయ సైన్సు దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తుంది. శుక్రవారం రాయపోల్ మండల బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ హాజరయ్యారు. విద్యార్థులు చేసిన ప్రయోగ నమూనాలను క్షుణ్ణంగా పరిశీలించి అవి పనిచేసే తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ మాట్లాడుతూ సైన్స్ అంటేనే వాస్తవికతకు నిదర్శనమన్నారు సైన్సుకు మూలాలు ఎక్కడున్నాయి అంటే పూర్వ కాలం నుంచి భారత దేశ ఆచార వ్యవహారాల్లో మనం ప్రతిరోజూ చేసే సే అన్ని పనులలో సైన్స్ ఇమిడి ఉందని పేర్కొన్నారు. సైన్స్ అంటేనే ప్రయోగాత్మకంగా నిరూపించబడినవని తెలిపారు. ఎల్లప్పుడూ మన జీవితంలో శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని మూఢనమ్మకాలను విడనాడి వాస్తవాలను మాత్రమే ఆచరించాలని పేర్కొన్నారు. పట్టుదల,క్రమ శిక్షణ, అంకితభావంతో చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. ప్రతి విద్యార్థికి పట్టుదల ఆలోచన క్రమశిక్షణ ఉండాలన్నారు. ఉన్నతమైన చదువు చదివి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని విద్యార్థులను కోరారు.అనంతరం విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అంతకుముందు విద్యార్థులు చేసిన నృత్యాలు,అతిథులు మంత్ర ముగ్ధులయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలయ్య, ఎంఈఓ నర్సమ్మ, స్పెషల్ ఆఫీసర్ చంద్రప్రకాష్, ఎంపీఓ లక్ష్మీనారాయణ,ఏపీఎం దుర్గాప్రసాద్, ఐసీడీఎస్ సూపర్వైజర్ షబాన,ఎంపిటిసి వెంకటయ్య,మాజీ సర్పంచ్ ప్రవీణ్, ఎంపీఓ సత్యనారాయణ రెడ్డి, వడ్డేపల్లి ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, సీఆర్పీలు యాదగిరి, స్వామి గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను డ్రైనేజీలలో పడేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో గల సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు సేకరించే వాహన యాజమాన్యతో కమిషనర్ గోల్కొండ నరసయ్య ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సెప్టిక్ ట్యాంక్ ద్వారా వ్యర్థాలను సేకరించేటప్పుడు పిపిఈ కిట్ (పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్మెంట్) ధరించి వ్యర్థాలను సేకరించాలని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా సేకరించిన వ్యర్థాలను మున్సిపాలిటీ వారి ఎఫ్.ఎస్.టి.పి (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్)కు తరలించాలన్నారు. సేకరించిన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలోగాని, మురుగు కాలువలోగాని పడవేసినచో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ ద్వారా వాహనాలకు లైసెన్సులు కచ్చితంగా తీసుకోవాలని ఆదేశించారు.. అదేవిధంగా నమస్తే యాప్ ద్వారా వారి వ్యక్తిగత వివరాలను రిజిస్టర్ చేయడంతో పాటు ప్రభుత్వం ద్వారా వచ్చే వాహన సబ్సిడీల, భీమా సౌకర్యాల గురించి వివరించామన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు దూరం

నవతెలంగాణ-కొండపాక



రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు దూరమవుతాయని ట్రాఫిక్ సిఐ రామకృష్ణ, త్రీ టౌన్ సిఐ విద్యాసాగర్‌లు అన్నారు. కొండపాక మండలం దుద్దెడ టోల్ ప్లాజా వారి ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన, ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత తదితర విషయాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు, ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని తెలిపారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని తెలిపారు. మోటార్ సైకిల్ వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. అలాగే సిబ్బందికి వాహన డ్రైవర్లకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ తెలిపారు. వైద్య శిబిరంలో రోడ్డు వినియోగదార్లకు, ఉద్యోగులకు కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, ఆర్ అండ్ బీ ఇండిపెండెంట్ ఇంజనీర్ పీవీ రావు, టోల్ ప్లాజా డీజీఎం విజయ్ భాస్కర్ రెడ్డి, ప్లాజా సీనియర్ మేనేజర్ ఎంఎస్ వై రావు, మేనేజర్ అశోక్ రెడ్డి, టోల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలికంగా సమసిన భూకబ్జా వివాదం



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం ఖమ్మం పల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. శుక్రవారం ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. రెవెన్యూ అధికారులు వచ్చి 130 ఎకరాల ప్రభుత్వ భూమిని కొలిచేంతవరకు ఎవరు కూడా అందులోకి వెళ్లకూడదని ఒప్పందం చేసుకున్నారు. ఖమ్మంపల్లి గ్రామం నుంచి ఎంపీటీసీ యాదగిరి, మాజీ సర్పంచ్ దామ శంకరయ్య, ఎన్సాన్ పల్లి నుంచి వచ్చిన సంతోష్ రెడ్డి, వినోద్‌ల మధ్య ఒప్పందం జరిగింది. అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించే వరకు అందులోకి ఎవరు వెళ్లరాదని, ఎలాంటి పనులు చేయకూడదని నిర్ణయించుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి వివాదాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కమిషనర్‌ను కలిసిన అత్తు ఇమామ్

నవ తెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రసన్న రాణిని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గ్యాదారి మధు, కోలన్ నరేష్, గయాజుద్దీన్, హబీబ్, లతీఫ్, గడ్డం సంతోష్ గౌడ్, చేపూరి సిద్ధి రాములు గౌడ్, నజ్జు తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

వనదేవతలకు మొక్కులు సమర్పించుకున్న భక్తజనం

లక్షకు పైగా హాజరైన భక్తజనం

ముగిసిన సమ్మక్క సారలమ్మ జాతర

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని పరివేద, వింజపల్లి, తంగళ్ళపల్లి గ్రామ శివారు మోయ తుమ్మెద నది తీరాన వెలసిన సమ్మక్క సారలమ్మ జాతర జనసంద్రమైంది. సుమారు లక్షల పైగా భక్తులు హాజరై మినీ మేడారాన్ని తలపించింది. గ్రామస్తులు సమ్మక్క జాతరస్థలానికి చేరుకుని వనదేవతలైన సమ్మక్క సారలమ్మను దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. బుధవారం నుంచి భక్తులు చిన్న పెద్ద తేడా లేకుండా అమ్మవార్ల వద్దకు చేరుకొని, బుధవారం బిడ్డసారాలమ్మ గద్దెకురాగా అలాగే గురువారం తల్లి సమ్మక్క రావడంతో భక్తులు శుక్రవారం నుంచి అమ్మవార్లను దర్శించుకున్నారు. జాతరకు మునుపెన్నోడు లేనివిధంగా భక్తులు రావడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. కమిటీ సభ్యులు పోలీసుల జోక్యంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుస్నాబాద్ సిఐ ఎర్రల కిరణ్, స్థానిక ఎస్సై సిహెచ్ తిరుపతి, పర్యవేక్షించారు. తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మొక్కులు సమర్పించుకున్నారు. ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్, జడ్పీటీసీ, నాగరాజు శ్యామల,తాజా మాజీ సర్పంచ్ పాము నాగేశ్వరి శ్రీకాంత్, ఎంపీటీసీ కొనే శేఖర్,లు హాజరై మొక్కులు సమర్పించారు. మునిపెన్నడూ లేనివిధంగా జాతరలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. చుట్టుకొండలు కొండల పక్కనే సెలయేరు, పక్కన సింగరాయ ప్రాజెక్టు ఉండడంతో భక్తులు రెండు రోజులపాటు ఇక్కడే సేద తీరారు శుక్రవారం సాయంత్రం వివిధ రకాల వాహనాలతో తిరుగు ప్రయాణమయ్యారు. అలాగే తంగళ్ళపల్లి గ్రామంతో పాటు పరివేద, వింజపల్లి గ్రామాలలో జరిగిన సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు హాజరై మొక్కులు సమర్పించుకున్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి

లింగ సమానత్వ ప్రత్యేక ప్రతినిధి ఎల్కంటి పద్మ

గుండారం సమ్మక్క సారలమ్మ జాతరలో చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-బెజ్జంకి

పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న సమాజంలో లింగ వివక్షను రూపుమాపాలని లింగ సమానత్వ ప్రత్యేక ప్రతినిధి ఎల్కంటి పద్మ మహిళలకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గుండారం గ్రామంలో నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవంలో మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై జిల్లా మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ, మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కరపత్రాల ద్వార అవగాహన కల్పించారు. ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్ సులోచన, జిల్లా మహిళ సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ వాసవి తదితరులు పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ శోభాయాత్రను జయప్రదం చేయాలి

నవ తెలంగాణ-సిద్దిపేట



సమత మూర్తి సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 647 జన్మదినం సందర్భంగా శనివారం సాయంత్రం 6 గం.లకు సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరగబోయే శోభాయాత్రను జయప్రదం చేయాలని జంబుద్వీప జన జాగృతి జిల్లా కోఆర్డినేటర్ లింగంపల్లి భాస్కర్ కోరారు. శోభయాత్ర పోస్టర్‌ను శుక్రవారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ సమతా, మానవత విలువలకు, జ్ఞానానికి ప్రతిరూపమైన సంతు శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ జ్ఞాన మార్గం నేటి తరానికి అత్యంత అవసరమన్నారు. శోభయాత్రలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంబూద్వీప జన జాగృతి జిల్లా కో-ఆర్డినేషన్ సభ్యులు రాయికొడ్ ప్రవీణ్, చిట్టిపాక రవీందర్, పింజరి అశోక్, బైరి వెంకటేషం, బోయ రాజన్, బైరీ శ్రీనివాస్, సింధు శ్రీనివాస్ , సుమన్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజేత డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

నవతెలంగాణ-గజ్వేల్



హుషారెత్తించే స్టెప్పులు, డీజే పాటలు, ఆకట్టుకునే నృత్యాలు, కడుపుబ్బ నవ్వించే సన్నివేశాలు, సందేశాత్మక నాటకాలు.. చివరగా కన్నీటి వీడ్కోలు.. ఇవన్నీటికి వేదిక అయ్యింది విజేత డిగ్రీ కళాశాల. శుక్రవారం విజేత డిగ్రీ కళాశాల తొమ్మిదవ వార్షికోత్సవ సందర్భంగా స్థానిక ప్రజ్ఞా గార్డెన్స్‌లో విజేత డిగ్రీ కళాశాల విద్యార్థులు 9వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి, ఉమాదేవి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనీ విద్యార్థులకు మార్గ నిర్దేశం చేశారు. తమ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో, రాజకీయంగా స్థిరపడి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచిపేరు తీసుకువచ్చారన్నారు. ఆటల పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. చివరగా కళాశాల ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు తృతీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిన రాములు, యాజమాన్యం రామచంద్రారెడ్డి, దేవేందర్ రెడ్డి, ఆడెపు నర్సింహులు, శివకుమార్ గౌడ్, రాధ కృష్ణ, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని సమ్మక్క సారక్క వనదేవతల గద్దెలను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ అమ్మవార్ల కృపతో ఆయురారోగ్యాలతో పాడిపంటలతో ఆనందంగా ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు యండి అయూబ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

నవతెలంగాణ-కొండపాక



మండలంలోని పలు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని వెలికట్ట కొండపాక బంగారం కుకునూరుపల్లిలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు డీలర్లు తమ దుకాణాల్లో బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్ సరిగా నిర్వహించాలని తెలిపారు. గ్రౌండ్ బ్యాలెన్స్ తప్పనిసరిగా సమానంగా ఉండాలన్నారు. లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ షాపు నేమ్ బోర్డు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. స్టాక్ రిజిస్టర్ ఫారమ్-ఎన్ లోనే ఉండాలని ఆదేశించారు. వానాకాలం యాసంగిలో ఒకే పొలంలో సంవత్సరాలు తరబడి వరి సాగు చేయడం వలన వరిలో సల్ఫర్ దుష్ప్రభావాన్ని గమనిస్తామని దీనివలన 30 నుండి 50 శాతం వరకు పంటదిగుబడి నష్టపోవటం జరుగుతుందని తెలిపారు.

జగదేవపూర్‌ను కప్పేసిన మంచు దుప్పటి

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ మండలంలో కేంద్రంలో శుక్రవారం ఉదయం సుమారు 9 గంటల వరకు పొగ మంచు కమ్మేసింది. వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం చేయాల్సి వచ్చింది. వ్యవసాయదారులు వరి.పలు రకాల కూరగాయల తోటల్లో పలు రకాల చీడలు వస్తుండడంతో రైతులు జాగ్రత్తగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు తెలిపారు. వాతావరణంలో పలు మార్పుల వల్ల పంట పొలాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. జాగ్రత్తలు పాటించకుంటే పంటలు నష్టపోతారని తెలిపారు.

ఉద్యోగంలో బదిలీలు తప్పనిసరి

నవ తెలంగాణ-మిరు దొడ్డి



ఉద్యోగ జీవితంలో ప్రతి ఉద్యోగికి బదిలీలు తప్పనిసరని ఎంపీపీ గజ్జల సాయిలు, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు అన్నారు. మండలంలో అందరి మన్ననలు పొందిన ఎంపీడీవో రాజిరెడ్డి బదిలీపై మెదక్ జిల్లాకు వెళ్లడం జరిగిందన్నారు. ఉద్యోగరీత్యా ప్రజలకు తన వంతు సహకారాన్ని అందిస్తూ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ఎంపీడీవో రాజిరెడ్డి ఎంతగానో కృషి చేయడం జరిగిందని తెలిపారు. అంకితభావంతో పనిచేసిన రాజిరెడ్డిని ఇక్కడి ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. కష్టమైన పనులను కూడా ఇష్టంగా చేస్తూ అందరి మన్ననలను ఎంపీడీవో రాజిరెడ్డి పొందడం హర్షించదగ్గ విషయన్నారు. బదిలీపై వెళ్తున్న రాజిరెడ్డిని శాలువాతో ఎంపీడీవో కార్యాలయం సిబ్బందితో పాటు ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి, సూపరింటెంట్ నారాయణ టెక్నికల్ అసిస్టెంట్లు కొండల్ రెడ్డి సుభాష్ మల్లారెడ్డి పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

టీఏఏ డైరీ ఆవిష్కరణ



నవ తెలంగాణ-సిద్దిపేట

ట్రస్టెడ్ అడ్వకేట్స్ అసోసియేషన్ (టిఏఏ) 2024 డైరీని సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో టిఏఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్, న్యాయవాది వరుకోలు రాజలింగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరీని న్యాయవాదులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దోనె అశోక్, మల్యాల శేషు కుమార్, బైరగొని వంశీకృష్ణ గౌడ్, వేణుగోపాల చారి, రమేశ్ చందూ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశం కొరకు, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన ఖాళీలను (సీట్లు)భర్తీ చేయుటకుగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మార్చి 2వ తేది వరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.